


RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

నిజానికి రాయల్ స్వరం


ద్వి భాషా దినపత్రిక

ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 155 | గురువారం 12 - 2 - 2026 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 | వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 155 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 12 THURSDAY february 2026 PAGES : 8 Rs :2-00


# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం



- అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం: 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం
- 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు : విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం
- వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం: ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

అమరావతి: రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశిరచిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్‌వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి ద్వారా మహిళలకు న్యాయ సహకారం కూడా అందిస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

## నరవణె పుస్తకం బయటకు ఎలా వచ్చింది?: పెంగ్విన్ సంస్థకు ఢిల్లీ పోలీసుల నోటీసులు

న్యూఢిల్లీ :ప్రముఖ పుస్తక ప్రచురణ సంస్థ 'పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా'కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంకు సంబంధించి రాజకీయ దుమారం చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇచ్చారు.ఈ పుస్తకం ప్రచురణ కానప్పటికీ రాహుల్ గాంధీ చేతికి ఈ కాపీ ఎలా చేరుకుందని ఇండియా టుడే డిజిటల్ మీడియాలో కథనం వచ్చింది. ఆ తర్వాత ఢిల్లీ పోలీసులు రంగంలోకి దిగి, ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పుస్తకం లీక్ అయినట్లు పేర్కొంటూ, ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద కేసు నమోదు చేసింది.ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించి పలు ప్రశ్నలను పోలీసులు సంధించారు. వాటికి పెంగ్విన్ నుండి సమాధానం అడిగారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.ప్రభుత్వం అనుమతి పొందకముందే నరవణె రాసిన ఈ పుస్తకం బయటకు రావడం వివాదంగా మారింది. పుస్తకం ప్రచురితం కాలేదని, మార్కెట్‌లో అందుబాటులో లేదని ప్రచురణ సంస్థ 24 గంటల్లో రెండుసార్లు వివరణ ఇచ్చింది. కానీ లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాత్రం ఆ పుస్తకం మార్కెట్‌లో లభ్యమవుతుందని అన్నారు.

## జనగణమన కంటే ముందు తప్పనిసరి: 'వందేమాతరం'పై కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ : 'వందేమాతరం' గీతాన్ని అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ బుధవారం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. 'జనగణమన' వంటి జాతీయ గీతాల కంటే ముందు దీనిని కచ్చితంగా ఆలపించాలని ఈ నిబంధనలలో పేర్కొంది. వందేమాతర గీతం ఆలపించినప్పుడు అందరూ నిలబడాలని పేర్కొంది.అన్ని పురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో



ప్రదేశాల్లో కూడా దీనిని తప్పనిసరి చేసింది. ఈ సందర్భాల్లో వందేమాతరం ఆలపించాలని ఈ నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా అంతరాయం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపింది. తాజాగా విడుదల చేసిన నిబంధనల కింద బాధ్యులకు గరిష్ఠంగా మూడేళ్ళ జైలు శిక్ష విధించనున్నట్లు స్పష్టం చేసింది. సినిమా హాల్స్ వంటి నిలబడటాన్ని తప్పనిసరి చేయలేదు.కేంద్ర ప్రభుత్వం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఈ కొత్త నిబంధనలను విడుదల చేసింది. 1937లో తొలగించిన నాలుగు చరణాలతో కలిపి మొత్తం ఆరు చరణాలను పాడాలని కేంద్రం వెల్లడించింది. స్వాతంత్ర పోరాట సమయంలో ముస్లిం లీగ్ అభ్యంతరాల మేరకు నాలుగు చరణాలను తొలగించిన కాంగ్రెస్, రెండు చరణాలను స్వీకరించింది. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రభుత్వం రెండు చరణాలతోనే 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది.

## ఏసీపీతో వాగ్వాదానికి దిగిన ధర్మపురి అర్వింద్



హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కాసేపట్లో ముగియనుంది. మరోవైపు పోలింగ్ సందర్భంగా నిజామాబాద్ లో ఓ సంఘటన చోటుచేసుకుంది. నిజామాబాద్ పరిధిలోని బూత్ నెంబర్ 7లో శంకర్ అనే కానిస్టేబుల్, మరో మున్సిపల్ ఉద్యోగి కలిసి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారనే సమాచారం తమకు అందిందంటూ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అక్కడకు చేరుకున్నారు. వారి తీరుపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఏసీపీతో ఆయన వాగ్వాదానికి దిగారు. మీ కానిస్టేబుల్ తప్పు చేస్తే... మీరు చేసినట్టేనని అన్నారు. మరోవైపు, వినాయక్ నగర్ డివిజన్ లో అర్వింద్ తో బీజేపీ కార్యకర్తలు మాట్లాడారు. ఓ డివిజన్ లో ప్రత్యర్థులు కుల ప్రస్తావన తెస్తున్నారని కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అర్వింద్ స్పందిస్తూ... క్యాస్ట్ ఫీలింగ్ తెచ్చేవారిని ఒక్కటే అడగాలని... కశ్మీర్ లో, బంగ్లాదేశ్ లో హిందువులను కులం అడిగి చంపారా? లేదా హిందువులు అని చంపారా? అని అడగాలని చెప్పారు.

## మున్సిపల్ ఎన్నికల్లో స్వల్ప ఉద్రిక్తతలు

### పలుచోట్ల పరస్పర ఘర్షణలు: దొంగ ఓట్ల ఆరోపణలతో పోలీసుల జోక్యం

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. పోలింగ్ కొనసాగుతున్న వేళ పలు జిల్లాల్లో స్వల్ప ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మహబూబాబాద్, నిజామాబాద్, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్యకర్తల మధ్య ఘర్షణలు, నినాదాలు, దొంగ ఓట్ల యత్నాలు వంటి ఘటనలు వెలుగుచూశాయి. పోలీసులు వేగంగా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మహబూబాబాద్ పట్టణంలోని 32, 33 పోలింగ్ బూత్‌ల వద్ద స్వల్ప ఘర్షణలు జరిగాయి. 14వ వార్డులో పోటీలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ఘర్షణకు దిగాయి. కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత పెరిగింది. సమాచారం అందుకున్న వెంటనే భారీగా పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పరిస్థితి అదుపులోకి తీసుకొచ్చేందుకు 14వ వార్డులో భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోందని అధికారులు



తెలిపారు.నిజామాబాద్ జిల్లాలో బుధవారం ఉదయం 9 గంటల వరకు 14 శాతం పోలింగ్ నమోదైంది. నగరంలోని కోటగల్లీ 25వ డివిజన్‌లో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ, కాంగ్రెస్ నేతలు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. పెద్ద ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. బోధన్ పట్టణంలో ఎంఐఎం, బీఆర్ఎస్ కార్యకర్తలు పరస్పరం నినాదాలు చేస్తూ ఉద్రిక్త వాతావరణం సృష్టించారు. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. నిజామాబాద్ జిల్లాలోని రాకాసిపేట్ పోలింగ్ కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండటంతో వారిని అడ్డుకుని కేసు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీలోని 15వ వార్డులోనూ స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న ఓటర్లను ప్రలోభ పెడుతున్నారంటూ బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది.బీజేపీ, బీఆర్ఎస్ ఇరువర్గాల మధ్య బాహాబాహీ చోటుచేసుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని అధికారులు తెలిపారు.సంగారెడ్డి జిల్లాలోని 28వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓ వ్యక్తి దొంగ ఓటు వేయడానికి ప్రయత్నించాడు. అప్పటికే మరో పోలింగ్ కేంద్రంలో ఓటు వేసిన సదరు వ్యక్తి.. 28వ వార్డులో మరోసారి ఓటు వేసేందుకు వచ్చినట్లు గుర్తించారు. అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పోలింగ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకున్నారు. ఆ వ్యక్తి చేతి వేలికి సిరా గుర్తువేసి పోలింగ్ కేంద్రం నుంచి పంపించారు. చట్టపరంగా ఆ వ్యక్తిపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు.

# సింగరాయకొండ ఎమర్జెన్సీ ల్యాండింగునకు ఇరువైపుల మరి కొంత భూమి సేకరణ

రాయల్ జర్నలిజం (ఒంగోలు) ఫిబ్రవరి 11: ఈ రోజు ఢిల్లీ లో కేంద్రో రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సెక్రటరీ ఎ. ఉమా శంకర్ ఐఏఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసిన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి గారు. ఈ సందర్భంగా 1. అత్యవసర పరిస్థితులలో విమానాల దిగుటకు శింగరాయకొండ వద్ద ఎమర్జెన్సీ లాండింగ్ గతంలో ఏర్పాటుచేయడం జరిగిందని, ప్రస్తుతం, సదరు ఎమర్జెన్సీ లాండింగునకు ఇరువైపుల మరికొంత భూమిని సేకరించుటకు కేంద్ర రోడ్డు రవాణ మరియు హైవేస్ శాఖవారు చేసిన ప్రతిపాదనలపై అచ్చట స్థానిక నివాసులు మరియు స్థలాలు -- భూములు కలవారు దీనివలన వారి స్థానిక నివాసాలకు, వ్యవసాయ కార్యకలాపాలకు మరియు



రోజువారి పనులకు ఎన్నో ఇబ్బందులు -- అంతరాయాలు కలుగునని మరియు ఈ విషయంపై స్థానికంగా విస్తృత సంప్రదింపులు మరియు అంచనాఅవసరమున్నదని, కనుక సదరు విషయాన్ని తిరిగిపరిశీలించవలసినదిగా కోరినారు. రామాయపట్నం NH-544 + (బెంగుళూరు - విజయవాడ ఎకనామిక్ కారిడార్) వయా చీమకుర్తి (65 కిమీ), NH-167 BG రామయపట్నం పోర్ట్ (15కిమీ) వరకు పొడగింపు. త్రోవగుంట - చదలావాడ గ్రామం వరకు NH-216 బైపాస్ నందు 7.5 కిమీ మేర విద్యుద్ దీపాలు ఏర్పాటు చేయవలసినదిగా కోరినారు. ఈ సందర్భంగా సెక్రటరీ సానుకూలంగా స్పందించి సింగరాయకొండ జూఖీ కు ప్రత్యేక బృందాన్ని పంపిస్తానని, రామయపట్నం పోర్ట్ వరకు రోడ్డు మరియు చదలావాడ గ్రామం వరకు లైట్లు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపినారు.

# వ్యవసాయ అనుబంధ శాఖల బడ్జెట్ నూరు శాతం ఖర్చు చేయాలి



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11: వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి కేటాయించిన బడ్జెట్ వంద శాతం ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సంబంధిత శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల పై శాఖల వారిగా సమీక్ష సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ శాఖల కు సంబంధించి కేటాయించిన బడ్జెట్ ను వంద శాతం ఖర్చు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏ పి ఎఫ్ ఆర్ జరుగుతున్న సర్వే పూర్తి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు రైతులకు సకాలంలో అందుతాయని తెలిపారు. ఈ సర్వే గత సంవత్సరం జూన్ నుండి జిల్లా జరుగుతుందని ఇప్పటి వరకు జిల్లా లో 79 శాతం పూర్తి చేయడం, సి సి ఆర్ సి కార్డులు కూడా వెంటనే వంద శాతం పూర్తి చేయాలని వ్యవసాయ జె డి ని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీ పథకాల అమలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుత రబీ/ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల సరఫరా పరిస్థితిని సమీక్షించి, ఎటువంటి కొరతలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు పంటలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించి, ఆధునిక సాగు పద్ధతులు, సూక్ష్మ నీటిపారుదల విధానాలు, సేంద్రియ వ్యవసాయం పై ప్రోత్సాహం కల్పించాలని సూచించారు.పంటల బీమా నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి రైతు లబ్ధి పొందేలా చూడాలని చెప్పారు. రైతు సేవ కేంద్రాల పనితీరును మెరుగుపరచి, రైతులకు ఒకే చోట అన్ని సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సి పి ఓ.ఏ.ఎస్.రాజు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ నిర్మల, ఏ డి ఏ, అన్నపూర్ణ, మార్క్ ఫెడ్ మేనేజర్ కరుణశ్రీ, మార్కెటింగ్ ఏ డి, రమేష్, ఉద్యానవన శాఖ అధికారి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా అంకమ్మ చౌదరి

రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11:బాపట్ల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులుగా అంకమ్మ చౌదరిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సీనియర్ సలహాదారులు గంట అంజిబాబు తెలిపారు. స్థానిక బాపట్ల క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారంక్రికెట్ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల క్రికెటర్ అసోసియేషన్ గత పాలకవర్గ కమిటీ కాలపరిమితి ముగిసినందున నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. నూతన కమిటీలో ప్రెసిడెంట్ ఎర్ర అంకమ్మ చౌదరి, వైస్ ప్రెసిడెంట్ బీ.జేరామ్ రెడ్డి ,సెక్రటరీ బిల్లా స్టాండ్లీ విమల్ కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎలవల నరేష్ ,ట్రెజరర్ అబ్దుల్ కరీం అదేవిధంగా బాపట్ల క్రికెట్ అసోసియేషన్కు గౌరవ అధ్యక్షులుగా బందా బాబు, సిహెచ్



రోశయ్యలో తో పాటు సభ్యులుగా పఠాన్ రాజేష్, ఎం శ్రీనివాసరావు ,కొట్ర వెంకటరావు, కొమరోలు శ్రీనివాస రావుని కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. అనంతరం ప్రెసిడెంట్ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ బాపట్ల క్రికెట్ అసోసియేషన్ బలోపేతనానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. బాపట్ల జిల్లాలో యువ క్రికెట్ క్రీడాకారుల అభివృద్ధికి కమిటీ సభ్యులందరూ తమ వంతు కృషి చేస్తామని ఆయన తెలిపారు. గత కమిటీ ఆధ్వర్యంలో యువ క్రీడాకారుల కోసం నెట్స్ ప్రాక్టీస్ నిమిత్తం గ్రౌండ్ కేటాయించడం జరిగిందన్నారు. యువ క్రీడాకారుల కోసం నెక్స్ట్ ప్రాక్టీస్ చేసేందుకు స్థలాన్ని కేటాయించిన బాపట్ల శాసనసభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ ,కలెక్టర్ వినోద్ కుమార్ లకు మా నూతన కమిటీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు. నూతనంగా ఎంపికైన బాపట్ల క్రికెట్ అసోసియేషన్ సభ్యులకు ప్రజా ప్రతినిధులు, సీనియర్ క్రికెట్ క్రీడాకారుల సలహాలు, సహకారాలు, అందించాలని ఆయన కోరారు.

# బైకుపై మృతదేహం తరలింపు ఘటనపై మంత్రి పార్థసారధి ఆరా......

- బాపట్ల జిల్లా కలెక్టర్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడిన మంత్రి....
- అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ....



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11:
బాపట్ల ఏరియా ఆసుపత్రి నుండి ఒక శవాన్ని బైకుపై తీసుకెళ్లిన ఘటనపై బాపట్ల జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి జిల్లా కలెక్టర్ డాక్టర్.వి.వినోద్ కుమార్ కి ఫోన్ చేసి ఆరా తీశారు. జిల్లాలో అందుబాటులో ఉన్న అంబులెన్సులు, అంబులెన్సుల కొరత, మహాప్రస్థానాలు తదితర అంశాలపై కలెక్టర్ తో చర్చించారు. శవాన్ని బైకుపై తీసుకెళ్లేంత పరిస్థితి ఎందుకు వచ్చింది? అని కలెక్టర్ ను ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా, కర్లపాలెం మండలం, చింతయపాలెం గ్రామానికి చెందిన నక్క నాగేశ్వరరావు మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లిన ఘటనపై తాను ఆరా తీశానని ఆసుపత్రి సిబ్బందికి చెప్పకుండా సదరు వ్యక్తులు నాగేశ్వరరావు మృతదేహాన్ని తీసుకెళ్లిపోయారని బాపట్ల ఏరియా ఆసుపత్రి సిబ్బంది చెప్పారని కలెక్టర్ బదులిచ్చారు. అప్రమత్తంగా వ్యవహరించాలని పేదవారికి ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని ఆదేశించారు.

ప్రైవేటు వాహనం ఇచ్చేలోపే శవాన్ని తీసుకెళ్లిపోయారు : సూపరింటెండెంట్

తదనంతరం బాపట్ల జిల్లా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెట్ డాక్టర్ కె.సిద్ధార్థ తో మంత్రి ఫోన్లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఏంటి? అని అడగ్గా ఏరియా ఆసుపత్రిల్లో మహాప్రస్థానం సౌకర్యం లేదని, ఒకవేళ ఎవరికైనా సొంతంగా వాహనాల్లో తమకు సంబంధించిన వారి మృతదేహాలను తీసుకెళ్లే పరిస్థితి లేకపోయినా, ఆర్థిక పరిస్థితుల వల్ల ఇబ్బంది ఉన్నా ఆసుపత్రి నుండి ప్రభుత్వ ఖర్చులతో ఒక ప్రైవేటు వాహనాన్ని ఇస్తున్నామని, దీనిపై జిల్లా కలెక్టర్ నుండి సర్క్యులర్ కూడా ఉందని వివరించారు. సదరు ఘటనకు సంబంధించిన విషయంలో ఆసుపత్రి సిబ్బందికి తెలియకుండా నాగేశ్వరరావు మృతదేహాన్ని బైకుపై తీసుకెళ్లిపోయారని వివరించారు. అంతేగాకుండా నాగేశ్వరరావు ఇంటివద్దే గుండెపోటుతో చనిపోయారని బాపట్ల ఏరియా ఆసుపత్రికి చనిపోయిన తర్వాత తీసుకొచ్చారని పేర్కొన్నారు. సొంత వాహనం మాట్లాడుకుని తీసుకెళతామని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఆసుపత్రి సిబ్బందికి చెప్పి, సిబ్బంది వేరొక ఎమర్జెన్సీ కేసును చూసే పనిలో ఉన్న సమయంలో ఈ విధంగా బైకుపై తీసుకెళ్లిపోయారని మంత్రికి వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు తావులేకుండా మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తపడాలని సూచించారు. తమ సొంత ఖర్చులతో ఎవరైనా తమ కుటుంబ సభ్యులు చనిపోతే తీసుకెళ్లలేని పరిస్థితులు ఉంటే ఆసుపత్రి నుండి ప్రైవేటు వాహనాన్ని సత్వరమే కేటాయించి మృతదేహాన్ని ఇంటికి చేర్చాలని సూపరింటెండెంట్‌కు మంత్రి ఆదేశాలు ఇచ్చారు.

# రేషన్ షాపు - అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యులు



రాయల్ జర్నలిజం (మేదరమెట్ల) ఫిబ్రవరి 11: బుధవారం కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలో బి.సి కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు ఇండేల లక్ష్మీ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 వ తారీఖు నుండి పిల్లలకి పాలు ఇవ్వటం లేదని రెండు రోజులు నుండి కోడి గుడ్లు ఇవ్వటం లేదని ఆయన గుర్తించారు . ఈ విషయం పై అంగన్వాడీ టీచర్ అనురాధ నీ ఆయన అడగగా ఇంకా స్టాక్ రాలేదని చెప్పటం జరిగింది. టైమ్ టు టైం స్టాక్ తెప్పించి ఇవ్వటం మీ బాధ్యత అని చెప్పారు. మెనూ కూడా అమలు చేయలేదని,ఈ విషయం పై సూపర్ వైజర్ అరుణ దేవిని అడగగా ఆమె కూడా సరైన సమాధానం చెప్పలేదని ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లోనీ, పిల్లలు, బాలింతల కోసం ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంత పెద్ద మొత్తం లో ఖర్చు చేస్తుంటే మీరు నిర్లక్ష్యం చేయటం మంచి పద్ధతి కాదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులకు మీరు తూట్లు పొడవొద్దన్నారు. నిర్లక్ష్యం వహించిన సూపర్ వైజర్ అరుణా దేవికి, టీచర్ అనురాధకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సి.డి.పి.వో ఎలిజబెత్ రాణి నీ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి ఆదేశించారు. రేషన్ షాపు తనిఖీ మేదరమెట్ల లో రేషన్ షాపు ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఈ షాపు నిర్వహించాలన్నారు. ఎటువంటి అవకతవలకి పాల్పడకూడదని ఆయన దిశానిర్దేశం చేశారు. షాపులో రేషన్ బియ్యంతో పాటు వాటర్ బబుల్స్ , ఇతర వస్తువులు ఉండటం గమనించి ఇలాంటి ఇక్కడ పెట్టకూడదని వెంటనే తీసేసి తనకి ఫోటో పెట్టాలన్నారు. ఈ పర్యటనలో ఆయన వెంట డి.ఎస్.వో పద్మ డి.ఎం సివిల్ సప్లైస్ అధికారి వరలక్ష్మి, సమగ్ర శిక్ష జిల్లా బాలిక సంరక్షణ అధికారి హేమలత, ఫుడ్ సేఫ్టీ అధికారి మహమ్మద్ సంశీర్ ఖాన్, సి.డి.పి.వో , తదితర అధికారులు పాల్గొన్నారు.

# సెయింటాన్స్‌లో ప్రారంభమైన ఐడియాథాన్



రాయల్ జర్నలిజం (వేటపాలెం), ఫిబ్రవరి 11: స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి కాలేజీలో విజయవాడ ఇన్నోవర్సిటి సహకారంతో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బిటెక్ 2వ సంవత్సరము చదువుతున్న విద్యార్థులకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఐడియాథాన్ వర్క్‌షాప్‌ను బుధవారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. జగదీష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజి ప్రపంచంలో ఇన్నోవేటివ్ ఐడియాస్ ఎంతో ప్రాధాన్యత వహిస్తున్నదని, టెక్నాలజిని ఉపయోగిస్తున్న ప్రతిఒక్కరు ఆశావహ దృక్పదాన్ని కలిగి ఉండాలని, తమ ఆలోచనలను ఆధునిక టెక్నాలజిలను ఉపయోగించి అందరికి అందుబాటులోకి తెవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆధునిక టెక్నాలజి, సాఫ్ట్‌వేర్‌లపై అవగాహన పెంపొందించుకోని ఉన్నత ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇ.సి.ఇ విభాగాధిపతి డా. డి. రాజేంద్ర ప్రసాద్, ఇన్నోవర్సిటి ప్రతినిధులు ఆర్. గోపికృష్ణ, వాహబ్, ఎ. హేమంత్, ఎ. హర్షవర్ధన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెనుమర్రు గ్రామంలో పారిశుధ్యం పై డిఎల్పిఓ విచారణ



రాయల్ జర్నలిజం (వేమూరు), ఫిబ్రవరి 11: మండలంలోని పెనుమర్రు గ్రామస్తులు తమ గ్రామంలో పారిశుధ్య చర్యలు సక్రమంగా లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు ఫోన్ సమాచారం ద్వారా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన బాపట్ల జిల్లా కలెక్టర్ తక్షణమే గ్రామాన్ని సందర్శించి చర్యలకు ఆదేశాలు జారీ చేయాలని డి ఎల్ డి ఓ పద్మజ ఆదేశించారు బుధవారం ఆమె గ్రామంలో పర్యటించి స్వయంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామపంచాయతీ ద్వారా పారిశుద్ధ్య చర్యలు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. డి ఎల్ డి ఓ స్థానిక పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో కోటేశ్వరరావు, కార్యదర్శి సింధుజ, సచివాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలతో పాటు ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. వేసవి దృష్ట్యా ముందస్తుగానే మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# బాపట్ల ఏరియా వైద్యశాల ఆకస్మిక తనిఖీ

- ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మంచి వైద్యం అందాలి
- బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11: ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మంచి వైద్యం అందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. బాపట్ల పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి మంచి ఆరోగ్యం, సంతోషంతో ఇంటికి తిరిగి వెళ్లాలని కలెక్టర్ చెప్పారు. వైద్యం కొరకు వచ్చే రోగులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. రోగులకు సంతృప్తి స్థాయిలో వైద్యం అందించాలని కలెక్టర్ చెప్పారు. ప్రాంతీయ వైద్యశాలలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు నిర్వహించే ప్రతి విభాగాన్ని ఆయన పరిశీలించారు. వైద్యం పొందుతున్న రోగులతో ఆయన మాట్లాడారు. వైద్య పరీక్షలకు వచ్చిన ప్రజలతోనూ ఆయన మాట్లాడారు. 100 పడకల ఆసుపత్రిలో 21 మంది వైద్యులు ఉండడం, ఓపి విభాగాలు, ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు 350 నుంచి 450 మంది వైద్య పరీక్షలకు ప్రజలు వస్తుంటారని వైద్య అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఓ పి విభాగం, తదితరమైన దస్త్రాలను ఆయన పరిశీలించారు. వైద్యం కొరకు ఎంతమంది వస్తున్నారు, ఎలాంటి కేసులు నమోదు అవుతున్నాయి, ఎలా వైద్యం అందిస్తున్నారంటూ ప్రతి డాక్టర్ తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలకు మంజూరైన యంత్రాలు, పరికరాలు, ఉపకరణాలు, తదితరమైన వస్తువులన్నీ వినియోగంలో ఉండాలని కలెక్టర్ పునరుద్ఘటించారు. వినియోగంలో లేని వస్తువులేవి వైద్యశాలలో ఉండరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన ఔషధాలు ముందస్తుగా నిల్వ చేసుకోవాలని, అందుబాటులో లేకుంటే అత్యవసరంగా కొనుగోలు చేయాలని సూచించారు. ఔషధాల కొరత లేకుండా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాన్పుల విభాగం, ఈసీజీ, ఎక్స్ రే, స్కానింగ్ గదులు, రోగులకు గాయాలు కడిగే గదిలో ఔషధాలు, సౌకర్యాలు, ఎస్ ఎన్ సి యు లో శిశు వులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ ఆసుపత్రిలోనే నెలకు 60 కాన్పులు జరుగుతుండగా, బ్లడ్ బ్యాంక్ లేకపోవడం ఏమిటన్నారు. నెలకు సగటున 100 యూనిట్ల రక్తం అవసరం కాగా, రక్త నిధి కేంద్రంలో రక్తం తక్కువగా ఉండడంపై ఆరా తీశారు. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. మార్చి చివరినాటికి బ్లడ్ బ్యాంక్ ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎముకలు కీళ్ల పరీక్షల గది, ఇంజక్షన్ల గదులలో ఒక బెడ్ లేకుండా వైద్యం ఎలా అందిస్తారని వైద్యులను కలెక్టర్ నిలదీశారు. దివ్యాంగులు వచ్చినప్పుడు ఎలా పరీక్షలు చేస్తారు, ఇంజక్షన్లు ఎలా వేస్తారన్నారు. దంత పరీక్షల విభాగంలో యంత్రం పనిచేయక పోతే రోగులకు వైద్య పరీక్షలు ఎలా చేస్తారు, అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. చర్మవ్యాధులు, శాస్త్ర చికిత్స విభాగం, రక్త నమూనాల సేకరణ, ల్యాబ్ లో యంత్రాల నిర్వహణ, సురక్ష క్లినిక్ సేవలు, గర్భిణీల పరీక్ష గదులు, ఫిజియోథెరపీ విభాగంలో అందిస్తున్న సేవలను ఆయన స్వయంగా పరిశీలించారు. కంటి వైద్య పరీక్షల విభాగంలో అందత్వ నివారణపై నెలకు 25 ఆపరేషన్లు జరుగుతుండగా, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. సదరం కేంద్రంలో వైద్య పరీక్షలు, ఐ సి టి సి కౌన్సిలింగ్ విభాగం, ఔషధాల పంపిణీ కేంద్రం, ఔషధాల ప్రధాన నిల్వ కేంద్రం, మార్చురీ గదులలో సౌకర్యాలను ఆయన పరిశీలించి, సేవలపై ఆరా తీశారు. రోగులకు పంపిణీ చేస్తున్న ఔషధాలు, వైద్యశాలలో సౌకర్యాలు, అందుబాటులో ఉన్న వనరులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆకస్మిక తనిఖీ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ, డి సి హెచ్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పద్మావతి హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆయన వెంట వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధార్థ, అయితే అధికారులు, తదితరులు ఉన్నారు.

# భక్తులు ఆహ్లాదకరంగా పండుగను జరుపుకోవాలి

**సీసీ కెమెరాలు, డ్రోన్ లతో దేవాలయ పరిసర ప్రాంతాలలో నిఘా ఉంచాలి:జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**



రాయల్ జర్నలిజం (అమర్తలూరు), ఫిబ్రవరి 11:మహిళలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చెయ్యాలని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ బుధవారం అమర్తలూరు మండలంలోని ప్రసిద్ధ శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. జిల్లా ఎస్పీకి ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ దేవస్థాన పరిసరాలు, క్యూ లైన్లు, భక్తులు ప్రవేశించే, తిరిగి వెళ్లే మార్గాలు, వ్రతం నిర్వహించే ప్రదేశాలను పరిశీలించారు.సంబంధిత అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 14, 15 తేదీలలో భారీ సంఖ్యలో భక్తులు గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానానికి వచ్చి దర్శించుకునే అవకాశం ఉన్నందున భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని 13వ తేదీ సాయంత్రం కల్లా అన్ని సౌకర్యాలు పూర్తి చేయాలన్నారు. 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల మండలాల నుండి భక్తులు భారీసంఖ్యలో వాహనాల్లో వచ్చే అవకాశం ఉన్నందున టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్, ఆర్టీసీ బస్సులకు విడివిడిగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలకు అర్థమయ్యే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేయాలని ఆదేశించారు. రాత్రి, వేకువజామున ప్రయాణించే భక్తులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు వైద్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్లు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.విద్యుత్ శాఖ వైర్ జాయింట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మహిళలు, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. భద్రత, నిఘా కోసం అదనపు సీసీ కెమెరాలు, 2 నుండి 5 కిలోమీటర్ల పరిధిని కవర్ చేసే అధునాతన డ్రోన్లు వినియోగించి దేవాలయ పరిసర ప్రాంతాలపై నిఘా ఉంచి, ట్రాఫిక్ సమస్యలను సైతం పర్యవేక్షించాలని తెలిపారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, ఎక్కడా అశ్లీలతకు తావు ఉండకూడదని, అధికారులు భక్తుల పట్ల సంయమనంతో వ్యవహరిస్తూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, అమర్తలూరు మండలంలోని గోవాడ గ్రామంలో ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవాలయం అత్యంత ప్రసిద్ధి గాంచిన చారిత్రక క్షేత్రమని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇక్కడ ఘనంగా శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుండి 18వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించబడతాయని తెలిపారు. సుమారు 1.5 లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగిందన్నారు.దానికి అనుగుణంగా సంబంధిత శాఖలైన రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్టీసీ, ఎండోమెంట్స్, వైద్య, ఫైర్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, దేవాదాయ శాఖ తదితర ప్రభుత్వ శాఖలు, దేవాలయ కమిటీతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగిన ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలీస్ శాఖ తరపున వాహనాల పార్కింగ్‌కు అనువైన ప్రదేశాల ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ, చెక్‌పోస్టుల ఏర్పాటు, గుడి లోపల క్యూ లైన్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు.భక్తుల రద్దీ దృష్ట్యా అన్ని విధాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శివరాత్రి సందర్భంగా



గోవాడ దేవాలయానికి వచ్చే భక్తులు ఆహ్లాదకర వాతావరణంలో దర్శనం చేసుకోవాలని, భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఆదర్శవంతంగా పండుగను జరుపుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు. వాహనాలపై ప్రయాణించే వారు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అధిక వేగంతో ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్డీఓ రామలక్ష్మి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ నాగయ్య, సిఐఓ అనుపమ, ఎంపిడిఓ శేషమాంబ, ఎంఆర్ఓ నెహ్రూ బాబు, గోవాడ సర్పంచ్ విజయలక్ష్మి, దేవాలయ చైర్మన్ రమేష్, ఈఓ విఠల్ శ్రీనివాస్ వర్మ, ఇతర సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచ తెలుగువారి చిరస్మరణీయులు ఘంటసాల

- ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలి
- పద్మశ్రీ ఘంటసాలకు ఘన నివాళులు




రాయల్ జర్నలిజం (చీరాల), ఫిబ్రవరి 11:
అమర గాయకులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వ రరావు ప్రపంచ తెలుగువారి చిరస్మ రణీయులని, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని సీనియర్ సిటిజన్స్ నాయకులు వెన్నెలకంటి సీతారామశర్మ అన్నారు. పద్మశ్రీ ఘంటసాల 52వ వర్ధంతి సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చీరాలలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీతారామశర్మ మాట్లాడుతూ ప్రపంచ తెలుగువారి సాంస్కృతిక ప్రతీక పద్మశ్రీ ఘంటసాల అని, ఆయన గానామృతం చిరకాలం వర్ధిల్లుతుందని, ఆయన గానామృతాన్ని, సినీ స్వర్ణయుగ విలువలను నేటి రేపటి భావితరాలుకి అందించాలని, చీరాల ఘంటసాల విగ్రహ అభివృద్ధి కమిటీకి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఘంటసాల సాంస్కృతిక చైతన్య ఉద్యమం నేటి సామాజిక అవసరమని, మానవ జీవితంలోని బహుముఖ కోణాలను ఆవిష్కరించిన ఘంటసాల గానామృతం భావితరాలకు అందించాలని, ఇది పెద్ద తరం సామాజిక కర్తవ్యమన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఆల్ ఇండియా స్థాయిలో తెలుగు గాయకుడైన పద్మశ్రీ ఘంటసాల గానామృత విశిష్టతను నేటి సామాజిక సంక్లిష్ట పరిస్థితులలో ఘంటసాల పాటతో సామాజిక సాంస్కృతిక చైతన్యం పెంపొందించుటకు ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక త్వరలో 15వ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పద్మశ్రీ ఘంటసాల 1944 నుండి 1974 వరకు 30 సంవత్సరాలు పాటు తెలుగు సినీ రంగంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి దిగ్గజ నటీనటులు, విజయ వాహిని వంటి స్టూడియోలు, మహోన్నతమైన నిర్మాతలు, రచయితలు, దర్శకులతో కలిసి సుమారు 10000 పాటలు పాడి తెలుగు సినీ స్వర్ణ యుగాన్ని సృష్టించారని, సుమారు 110 తెలుగు సినీ కళాఖండాలకు సంగీత దర్శకత్వం వహించారని, తెలుగు మహోన్నత సాంస్కృతిక రంగాన్ని ఆవిష్కరించారన్నారు. నేడు ఘంటసాల 52వ వర్ధంతిని ప్రపంచమంతటా జరుపుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ అధ్యక్షులు గాదె హరిహరరావు, చీరాల ఘంటసాల చైతన్య వేదిక ప్రాంతీయ కమిటీ కార్యదర్శి పాలెపు కనక మోహన్ రావు, పల్లపోలు నాగ మనోహర్ లోహియా, బాలకృష్ణ, కాసా వీరరాఘవులు, చైతన్య కుమార్, రంగనాయకులు, నారాయణ, సుభాని తదితరులు పాల్గొన్నారు.

# చింతగుంపలలో ఉచిత వైద్యశిబిరం నిర్వహణ




రాయల్ జర్నలిజం (చిన్నగంజాం), ఫిబ్రవరి 11:
పర్చూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, గ్రామ సర్పంచ్ యార్లగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో మండలంలోని చింతగుంపల గ్రామంలో ఎన్టీఆర్ బొమ్మ వద్ద బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కళ్ళు, ఈసీజీ, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి గుండె, కిడ్నీ పేషెంట్లకు తగు జాగ్రత్తలు చెప్పారు. 240 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ మాట్లాడుతూ రోగ నిర్ధారణ జరిగిన 55 మంది పేషెంట్లకు ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ నందు ఆరోగ్యశ్రీ, ఈఎస్ఐ, ఈహెచ్ఎస్ ,ఈసిహెచ్ఎస్ ,రైల్వే , ఎఫ్ సి ఐ కార్డుల ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని తెలియజేశారు. ఈ క్యాంప్ నందు డాక్టర్ రామాంజనేయులు, ఆప్తమాట్రిక్స్ ప్రేమ్ కుమార్, గ్రామ పెద్దలు, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారునికి ప్రోత్సాహం



రాయల్ జర్నలిజం (వేటపాలెం ), ఫిబ్రవరి 11:వేటపాలెం పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో గ్రామవాసి అయిన మాస్టర్ అథ్లెటిక్స్ క్రీడాకారుడు గాత్రం ఉమామహేశ్వరావు 45 ప్లస్ ఏజి కేటగిరీలో ఆల్ ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ 2026 పొంది థాయిలాండ్‌లో జరిగే ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మీట్ పోటీలలో పార్టిసిపేట్ చేయడానికి ప్రోత్సాహకంగా రూ. 12 వేలు ఆర్థిక సాయం బుధవారం సంఘ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ యీ ప్రాంతంలో స్పోర్ట్స్ ను ప్రోత్సహిస్తున్నటువంటి ఉమాకి ప్రోత్సహించడమే కాకుండా, సంఘం యొక్క ఆశయం యువత గేమ్స్ వైపు ప్రాధాన్యతగా ముందుకు ఎదగాలని కోరుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి నాగాంజనేయులు, సభ్యులు నున్నా శివప్రసాదరావు, ప్రత్తి శరత్ బాబు, నాగరాజు, శేఖర్ బాబు, శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయకు ఘన నివాళులు



రాయల్ జర్నలిజం (చీరాల), ఫిబ్రవరి 11:
పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా చీరాల భారతీయ జనతా పార్టీ కార్యాలయం నందు బీజేపీ నాయకులు బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ మువ్వల వెంకటరమణారావు, జిల్లా కన్వీనర్ కాకర్ల శ్రీవెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మేడికొండ భరణిరావు, చీరాల మండల రూరల్ అధ్యక్షులు బక్కా మనోహర్ రెడ్డి, పింజల భరణిరావు, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి నాశన మణి కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కృష్ణ అర్జున్, అవ్వారు ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి తడవర్తి రఘునాథ్, ఎస్సీ మోర్చా నాయకులు కాకుమాను సుబ్బారావు, బాంబే సురేష్, మురళి, మున్నం శ్రీనివాసరెడ్డి, డి. శ్రీనివాసరావు, గంజి లక్ష్మయ్య, జగదీష్, సిహెచ్. శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# నడిరోడ్డుపై నోట్ల కట్టలు విసిరేసి వ్యక్తి పరార్



హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల పోలింగ్ వేల భూపాలపల్లి మున్సిపాలిటీలో నోట్ల కట్టలు తీవ్ర కలకలం రేపాయి. ఓ పార్టీకి చెందిన వ్యక్తి పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసేందుకు ప్రయత్నించాడు. అది గమనించిన పోలీసులు అతడ్ని పట్టుకునేందుకు యత్నించగా.. నోట్ల కట్టలు రోడ్డుపై విసిరేసి అక్కడి నుంచి పరారయ్యాడు.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. 7 కార్పోరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో ఎన్నికల పోలింగ్ జరగుతుండగా.. దాదాపుగా అన్ని చోట్ల ప్రశాంతవాతవరణంలో ఓటర్లు ఓట్లేస్తున్నారు. అయితే కొన్నిచోట్ల మాత్రం ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం శ్రేణులు బాహాబాహీకి దిగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మున్సిపాలిటీలో నోట్ల కట్టలు కలకలం రేపాయి.ఓ వైపు ఎన్నికల పోలింగ్ జరగుతుండగా.. పోలింగ్ కేంద్రం సమీపంలోనే నోట్ల కట్టలు దర్శమిచ్చాయి. 22వ వార్డు పోలింగ్ కేంద్రం సమీపంలో ఓ పార్టీకి చెందిన వ్యక్తి నడిరోడ్డుపై నోట్ల కట్టలు విసిరేసి పరారయ్యాడు. ఓటర్ డబ్బు పంచేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకునే క్రమంలో బయపడిపోయిన సదరు వ్యక్తి డబ్బుల కట్టలను రోడ్డుపై విసిరేసి అక్కడి నుంచి పరారయ్యాడు. సుమారు 1లక్ష రూపాయల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఇక మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తగా.. రెండు పార్టీ ల నేతలు చొక్కాలు పట్టుకుని కొట్టుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు ఇరు పార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో బీజేపీ కార్యకర్త మెడలో కండువాను పోలీసులు లాగారు. స్కూటీ మీద ఉన్న కార్యకర్తతో పోలీసుల వాగ్వాదం పెట్టుకున్నారు. తమ కార్యకర్తపై పోలీసులు చేయి చేసుకున్నారని ఆరోపించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ కాసేపు ఆందోళన చేపట్టారు.ఇక పలువురు నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ జెడ్పీ హైస్కూల్‌లో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో ఓటేశారు. నిజామాబాద్ పట్టణంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కరీంనగర్ పట్టణంలో ఓటేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనే ఆయుధాన్ని కుటుంబ సభ్యులతో కలిసి వినియోగించుకోవాలని బండి సంజయ్ కోరారు.

# రాష్ట్రంలో 10 మంది ఐఏఎస్‌లు బదిలీ.. సింగరేణికి కొత్త సీఎండీ



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం భారీ ఎత్తున ఐఏఎస్‌లను బదిలీ చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం 10 మందిని బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎస్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించగా.. ముగ్గురు కమిషనర్లను నియమించారు. ఇక సింగరేణి కాలరీస్‌కు కొత్త సీఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాశ్‌కు భాద్యతలు అప్పగించారు.తెలంగాణలో ప్రభుత్వం మరోసారి భారీగా ఐఏఎస్‌లకు స్థానచలనం కల్పించింది. మట్నత్తం10 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణి బొగ్గు గనులపై రాజకీయ దుమారం రేగిన నేపథ్యంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు కొత్త సీఎండీని నియమించారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఉన్న జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను సింగరేణి కొత్త సీఎండీగా బదిలీ చేశారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించారు. ఈ మేరకు గెజిట్ విడుదల చేశారు. పాత జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగనుండగా.. మల్కాజిగి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా టి. వినయ్ కృష్ణారెడ్డిని నియమించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజనకు బాధ్యతలు అప్పగించారు.ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్‌కు ఎస్సీ సంక్షేమ శాఖకు సంబంధించి అదనపు బాధ్యతలను సర్కార్ అప్పగించింది. దాంతోపాటుగా గిరిజన సంక్షేమ శాఖ బాధ్యతలను కూడా ఆయనే నిర్వర్తించనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా దివ్యకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాకు ప్లానింగ్ శాఖ ప్రధాన కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జలమండలి ఈడీ నుంచి మయాంక్ మిట్టల్‌ను జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా పి.కాత్యాయని దేవిని నియమించారు. ఐటీ, పరిశ్రమలు మరియు శాసన వ్యవహారాల శాఖ మంత్రికి ఓఎస్డీగా ఉన్న రఘురాం శర్మను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించారు. అలాగే మంత్రి ఓఎస్డీగా కూడా ఆయనే అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. కాగా, బదిలీ అయిన ఐఏఎస్‌లు తక్షణమే బాధ్యతలు చేపట్టాలని సీఎస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక గంతలోనూ పలవురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పరిపాలనా సౌలభ్యం కోసం తరుచూ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేస్తోంది.

# ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు పండగే.. ప్రమోషన్లపై కీలక ఆదేశాలు.. 7673 ఉద్యోగాల భర్తీ



అమరావతి :ఏపీ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆర్టీసీలో ఉద్యోగులకు సంబంధించిన ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీపై సమీక్ష చేశారు. ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించ్చరు. అలాగే ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని.. ఆ తర్వాత ప్రభుత్వానికిం పంపించాలని ఆదేశించారు. అంతేకాదు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సంబంధించి పన్నుల అంశంపై కూడా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త.. ప్రమోషన్లపై కీలక ముందడుగు పడింది. మొత్తం 7,514 ఉద్యోగులకు సంబంధించిన పదోన్నతులపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో కలిసి మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆర్టీసీ, రవాణా శాఖలపై సమీక్ష చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన ప్రమోషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. మొత్తం 7,514మంది వరకు అర్హులైన ఉద్యోగులు ఉన్నారని.. వారికి త్వరగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ నెల 20 నాటికి 2025-26 డీపీసీ కింద అర్హులైన ఉద్యోగుల ఎంప్యానల్‌ను పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నామని ఆర్టీసీ అధికారులకు మంత్రికి తెలిపారు.ఏపీఎస్ఆర్టీసీలో ప్రస్తుతం 44,131 మంది ఉద్యోగులు ఉన్నారని మంత్రికి అధికారులు వివరించారు. వీరిలో కూడా ఈ మూడేళ్లలో 6,891 మంది ఉద్యోగులు రిటైర్ అవుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆర్టీసీలో 7,673 ఖాళీల నియామకాలకు అవకాశం ఉంటుందని.. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆర్టీసీలో 682 మంది ఉద్యోగులు మెడికల్ అన్‌ఫిట్ అయ్యారని.. వీరిలో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించామన్నారు. మరో 646 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని మంత్రికి అధికారులు వివరించారు.కొన్ని ట్రావెల్స్ బస్సుల్ని ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించి.. ఏపీలో తిప్పుతున్నారు. ఈ బస్సులకు సంబంధించి పర్మిట్ పన్నులపై.. ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలకు సంబంధించి సంఘాలతో సమావేశం నిర్వహించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి నిర్ణయించారు. ఈ సమావేశంలో పన్నుల అంశంపై ఓ నిర్ణయం తీసుకుందామన్నారు. ఆ బస్సులు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోకుండా.. ఏపీలోనే రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూద్దామని.. రాష్ట్రంలో ఏ పన్ను తగ్గిస్తే ఆయా బస్సులు రిజిస్ట్రేషన్ అవుతాయో మంత్రికి అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా వాహనాల రిజిస్టరేషన్ సర్టిఫికెట్లకు సంబంధించిన స్మార్ట్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్సుల కోసం టెండర్ నిబంధనల్ని త్వరగా ఖరారు చేయాలని మంత్రి అధికారుల్ని ఆదేశించారు. కేంద్రం ఇటీవల రవాణా వాహనాలకు సంబంధించి.. వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ డివైజ్ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలనే నిబంధన తీసుకొచ్చింది. దీనికి సంబంధించి ఆర్ఎఫ్‌సీ సిద్ధం చేయాలని మంత్రి సూచించారు.

# వైఎస్ జగన్‌ను కలిసిన టీడీపీ ఎంపీ.. ఫోటో వైరల్, రెండు రోజులకే ఢిల్లీలో అసలు ట్విస్ట్



అమరావతి :సోషల్ మీడియాలో ఓ ఫోటో బాగా వైరల్ అవుతోంది. టీడీపీ ఎంపీ వైఎస్ జగన్‌ల మధ్య పలకరింపుల ఫోటో హాట్‌టాపిక్ అయ్యింది. ఏకంగా ఎంపీ పార్టీ మారబోతున్నారంటూ ప్రచారం మొదలు పెట్టారు. అసలు అక్కడ ఏ జరిగింది.. ఎంపీ, జగన్‌ల పలకరింపుల సంగతేంటి. రెండు రోజుల తర్వాత ఢిల్లీలో జరిగిన మ్యాటర్ ఏంటి.. ఏపీ పొలిటికల్ సర్కిల్స్‌లో ఫోటోపై ఎందుకు చర్చ జరుగుతోంది?ప్రతి దాన్ని రాజకీయంలా చూడకూడదు.. రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉన్నంతమాత్రాన ఎదురుపడితే పలకరించుకోకుండా ఉండలేరు కదా. రాజకీయ నేతలు ఏదైనా కార్యక్రమానికి వెళితే.. వేర్వేరు పార్టీల్లో ఉన్నా సరే ఒకర్ని ఒకరు పలకరించుకోవడం సర్వ సాధారణం. అయితే ఏపీ రాజకీయాల్లో ఓ ఫోటో ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది.. టీడీపీ ఎంపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలవడం చర్చనీయాంశమైంది. తాజాగా చెన్నైలో వైఎస్ సునీల్ రెడ్డి కుమారుడు సాహిల్ వివాహ వేడుక జరిగింది.. రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ కూడా ఈ వేడుకకు వెళ్లారు.. ప్రకాశం జిల్లా ఒంగోలు టీడీపీ ఎంపీ మాగుంట శ్రీనవాసులరెడ్డి కూడా పెళ్లికి వెళ్లారు.వైఎస్ జగన్ , మాగుంట శ్రీనివాసులరెడ్డి ఒకర్ని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. దీంతో కెమెరాలు అటు వైపుగా ఫోకస్ పెట్టి వీడియోలు, ఫోటోలను క్లిక్ అనిపించాయి. ఇంకేముంది ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఒకరి ఒకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పరమైన అంశాలు ఎక్కడా చర్చకు రాలేదని చెబుతున్నారు. వివాదాలకు దూరంగా ఎంపీ మాగుంట ఒక్కసారిగా వార్తల్లోకి వచ్చేశారు. ఇక్కడ ఇద్దరు నేతలు ఆప్యాయంగా పలకరించుకోవడంలో ఎలాంటి తప్పు లేదనే చెప్పాలి. రాజకీయంగా వేర్వేరు పార్టీల్లో ఉన్నా సరే.. ఎదురుపడిన సమయంలో పలకరింపులు మామూలే. అయితే కొందరు మాత్రం ఈ పలకరింపులు వెనుక పొలిటికల్ ఎజెండా ఉందనే చర్చను తెరపైకి తెచ్చారు. అయితే మాగుంట వర్గం మాత్రం రాజకీయ ప్రాధాన్యం లేదని వేడుకలు ఎదురుపడిన సమయంలో పలకరింపులు మాత్రమే అంటున్నారు.మాగుంట ఫోటోను గత రెండు, మూడు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఆయన మళ్లీ వైఎస్సార్‌సీపీ గూటికి వెళుతున్నారంటూ ప్రచారం మొదలుపెట్టారు. వచ్చే ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీ చేయనని ప్రకటించారు.. తన కుమారుడు రాఘవరెడ్డి పోటీ చేస్తారని చెప్పారు. కొడుకు భవిష్యత్ కోసం పార్టీ మారతారా అంటూ కొందరు అనుమానాలు మొదలుపెట్టారు. అయితే మాగుంట ఎపిసోడ్‌పై చర్చ జరుగుతున్న సమయంలో ఆసక్తికర సన్నివేశం కనిపించింది. ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు.. పలువురు కేంద్రమంత్రుల్ని కలిశారు. అయితే మాగుంట కూడా ఈ పర్యటనలో కనిపించారు.. సీఎంతో పాటుగా పలువురు కేంద్రమంత్రుల్ని కలిశారు. దీంతో మాగుంట ఎపిసోడ్‌లో పార్టీ మార్పుపై జరుగుతున్న రూమర్స్‌కు ఛాన్స్ లేదనే క్లారిటీ వచ్చిందంటున్నారు. మొత్తం మీద మాగుంట, జగన్ ఫోటో ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది.మాగుంట ఫ్యామిలీ మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉంది.. 2014 ఎన్నికలకు ముందు శ్రీనివాసులరెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఒంగోలు ఎంపీగా 2014లో పోటీచేసి ఓడిపోగా.. ఆ తర్వాత ఎమ్మెల్సీ పదవి దక్కింది. అయితే అనూహ్యంగా 2019 ఎన్నికలకు ముందు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరి ఒంగోలు ఎంపీగా పోటీచేసి గెలిచారు. మళ్లీ 2024 ఎన్నికల ముందు మాగుంట టీడీపీలోకి వచ్చారు.. ఒంగోలు ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు.

# కుక్క ప్రాణాలు కాపాడటానికి ఢిల్లీ నుంచి విశాఖపట్నం విమానంలో వచ్చిన డాక్టర్.. ఇంట్రెస్టింగ్ స్టోరీ



అమరావతి :ఓ డాక్టర్ ఆగమేఘాల మీద ఢిల్లీ నుంచి విశాఖపట్నం విమానంలో వచ్చారు. ఓ కుక్క ప్రాణాలు కాపాడేందుకు ఆయన ఎమర్జెన్సీగా చేరుకున్నారు. ఓ కుక్క దారం, సూదిని మింగేసింది. అయితే విశాఖపట్నంలోని ఆస్పత్రికి తీసుకెళితే సర్జరీ చేస్తే ఇబ్బందవుతుందున్నారు. వెంటనే ఢిల్లీ నుంచి డాక్టర్‌ను పిలిపించి ఎండోస్కోపీ ద్వారా బయటకు తీయడంతో కుక్క ప్రాణాలకు ముప్పు తప్పింది.ఓ కుక్కను కాపాడటానికి డాక్టర్ ఢిల్లీ నుంచి విమానంలో వచ్చారు. డాక్టర్ విమానంలో రావడం ఏంటి.. కుక్క కాపాడటం ఏంటని అనుకుంటున్నారా. మీరు వింటున్నది నిజమే.. విశాఖపట్నంలో ఈ ఆసక్తికర ఘటన జరిగింది. విశాఖపట్నానికి చెందిన ఒకరు గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన పెంపుడు కుక్కను పెంచుకుంటున్నారు. ఈ కుక్క కొన్ని రోజులుగా ఇబ్బందిపడుతోంది.. వెంటనే యజమాని ఈ నెల 5న ఓ పెట్‌డాగ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ అనుమానంతో కుక్కకు ఎక్స్‌రే తీయించమని యజమానికి సూచించారు. కుక్కకు ఎక్స్‌రే తీయించి చూడగా.. పొట్టలో దారపు ఉండ, సూది ఉన్నట్లు గుర్తించారు.పెట్ ఆస్పత్రిలో సర్జరీ చేయించి బయటకు తీద్దామంటే కుక్కకు ప్లేట్లెట్స్ పడిపోతున్నాయి.. దీంతో సాధ్యం కాదని డాక్టర్ చెప్పారు. అయితే యజమాని కుక్కను ఎలాగైనా బతికించమని వేడుకున్నారు. అప్పుడు పెట్ ఆస్పత్రిలో డాక్టర్ శ్రీధర్ వెంటనే ఢిల్లీలో ఉన్న తన స్నేహితుడు, వెటర్నరీ స్పెషలిస్ట్ డాక్టర్ మల్హోత్రాకు ఫోన్ చేసి సమస్య మొత్తం చెప్పారు. ఆయన వెంటనే కొన్ని పరికరాలను తీసుకుని శుక్రవారం నాడు ఢిల్లీ నుంచి బయల్దేరి విశాఖపట్నం వచ్చారు. డాక్టర్ మల్హోత్రా 45 నిమిషాల పాటూ శ్రమించారు.. ఎండోస్కోపీ విధానంలో కుక్క పొట్టలో ఉన్న దారం, సూదిని బయటకు తీశారు. ఇక తన పెంపుడు కుక్క తనకు దక్కదు అనుకునే సమయంలో డాక్టర్ మల్హోత్రా సాయంతో ప్రాణాలు కాపాడారు. తన శునకానికి ఎలాంటి ఇబ్బంది లేదని తెలిసన తర్వాత యజమాని ఆనందం వ్యక్త చేశారు. తన కుక్కను కాపాడిన డాక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు.ఢిల్లీ నుంచి డాక్టర్ రావడం, ట్రీట్మెంట్ చేయడం అంటే ఖర్చుతో కూడుకున్న అంశం. విమాన ఛార్జీలు, ట్రీట్మెంట్ చేసినందుకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయినా సరే యజమాని మాత్రం ఏమాత్రం వెనక్కు తగ్గలేదు.. ఖర్చు అవుతుందని కూడా ఆలోచించలేదు. తన పెంపుడు శునకం ప్రాణాలు కాపాడాలనే ఆలోచించారు.. ఢిల్లీ నుంచి డాక్టర్‌ను పిలిపించి మరీ కుక్క ప్రాణాలను నిలబెట్టుకోగలిగారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# "టాయిలెట్ పేపర్ లా వాడేసి విసిరేశారు" - అమెరికాపై రగిలిపోతున్న పాకిస్తాన్..!



న్యూఢిల్లీ :భారత్-పాకిస్తాన్ మధ్య శత్రుత్వాన్ని వాడుకుంటూ అమెరికా చేసే రాజకీయాలు ఎలా ఉంటాయన్నది పలు సందర్భాల్లో నిరూపితమైంది. తాజాగా గతేడాది భారత్ లోని పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సమయంలో మధ్యవర్తిగా ఎంట్రీ ఇచ్చి ఇద్దరి మధ్య కాల్పుల విరమణ చేయించినట్లు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకున్నారు. ఈ వాదనతో భారత్ ఏకీభవించకపోవడం, తాము అడగ్గానే కాల్పుల విరమణకు సహకరించడంతో ట్రంప్ కు పాక్ దగ్గరైంది. ఆ తర్వాత భారత్ పై భారీ సుంకాలు విధించి, పాకిస్తాన్ పాలకులతో ట్రంప్ విందులు చేసుకున్నారు.దీంతో పాకిస్తాన్ కూడా ఇక అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుని భారీ ఎత్తున ప్రయోజనం పొందాలని, తద్వారా భారత్ తో ట్రంప్ బంధానికి బీటలు వారతాయని లెక్కలేసుకుంది. కానీ సీన్ రివర్స్ అయింది. భారత్ వంటి భారీ మార్కెట్ ను వదులుకుని, నానాటికీ ఆర్థికంగా బీటలు వారుతున్న పాకిస్తాన్ కు అండగా నిలిచేందుకు ట్రంప్ నో చెప్పేశారు. దీని ఫలితమే భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం. ఈ ఒప్పందం ఇచ్చిన షాక్ నుంచి పాక్ ఇప్పటికీ కోలుకోలేకపోతోంది.దీంతో అమెరికా తమను వాడుకుని టాయిలెట్ పేపర్ లా విసిరేశారని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమెరికాతో తమకు ఉన్న బంధాన్ని ఆయన అంగీకరించారు. అమెరికా తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని దోపిడీ చేసిందని, వాళ్ల లక్ష్యాలు నెరవేరాక టాయిలెట్ పేపర్ ముక్కలాగా విసిరేసిందని ఆయన ఆరోపించారు. పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీలో మాట్లాడుతూ.. తమ దేశం తరచూ తమకున్న ఉగ్రవాద చరిత్రను తిరస్కరిస్తుందని, కానీ ఇది గతంలో నియంతలు చేసిన తప్పు అని అంగీకరించారు.అలాగే రెండు ఆఫ్ఘన్ యుద్ధాలలో పాకిస్తాన్ భాగస్వామి కావడాన్ని కూడా మరో తప్పుగా అభివర్ణించారు. ఇవాళ పాకిస్తాన్‌లో జరుగుతున్న ఉగ్రవాద ఘటనలు తమ గత తప్పులకు ప్రతిఫలమని అంగీకరించారు. 1999 తర్వాత ఆఫ్ఘనిస్తాన్ విషయంలో అమెరికా-పాకిస్తాన్ కలిసి పనిచేయడం తమ దేశానికి శాశ్వత నష్టాన్ని మిగిల్చిందని ఖవాజా పేర్కొన్నారు. 2001సెప్టెంబర్ 11 దాడుల తర్వాత అమెరికాతో తిరిగి పొత్తు పెట్టుకోవడం వల్ల కలిగిన నష్టాలు చాలా దారుణంగా ఉన్నాయన్నారు. పాకిస్తాన్‌ను టాయిలెట్ పేపర్ ముక్క కంటే దారుణంగా చూశారని, దానిని తమ ప్రయోజనాల కోసం వాడుకుని విసిరేశారని విమర్శించారు.

# బంగారం ధరల్లో మళ్లీ.. బయ్యర్లల్లో అయోమయం



దేశీయ బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (వీజఃశ)లో ఈ ఉదయం సుమారు ఒక శాతం మేర పెరుగుదల కనిపించింది. 10 గ్రాములకు 1,57,975 రూపాయలకు చేరింది. అదే సమయంలో వెండి ధర 3.12 శాతం పెరిగింది. కిలోకు 2,60,433 రూపాయలకు ఎగబాకింది. స్పాట్ మార్కెట్‌లో వెండి కిలోకు సుమారు 2,60,500లకు ట్రేడ్ అవుతోంది. డాలర్ బలపడటం, అమెరికా మార్కెట్ స్థితిగతులు దీన్ని ప్రభావితం చేస్తోన్నాయి.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలను పరిశీలిస్తే- ఢిల్లీ, జైపూర్ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 1,45,000, 24 క్యారెట్లు 1,58,560 రూపాయలుగా నమోదైంది. అహ్మదాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం రూ. 1,45,300, 24 క్యారెట్లు రూ. 1,58,460 పలుకుతోంది. పూణే, ముంబై, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా నగరాల్లో 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ. 1,45,250 చొప్పున, 24 క్యారెట్లు రూ. 1,58,410 చొప్పున లభిస్తోంది.

ప్రధాన నగరాల్లో నేటి బంగారం ధరలు (గ్రాముకు)

చెన్నై..

24 క్యారెట్లు- రూ. 15,928, 22 క్యారెట్లు - రూ. 14,600, 18 క్యారెట్లు - రూ. 12,540

ముంబై..

24 క్యారెట్లు - రూ. 15,851, 22 క్యారెట్లు- రూ. 14,530, 18 క్యారెట్లు - రూ. 11,889

బెంగళూరు..

24 క్యారెట్లు - రూ. 15,851, 22 క్యారెట్లు- రూ. 14,530, 18 క్యారెట్లు - రూ. 11,889

హైదరాబాద్..

24 క్యారెట్లు - రూ. 15,851, 22 క్యారెట్లు- రూ. 14,530, 18 క్యారెట్లు - రూ. 11,889

విజయవాడ..

24 క్యారెట్లు - రూ. 15,851, 22 క్యారెట్లు- రూ. 14,530, 18 క్యారెట్లు - రూ. 11,889

# టెక్ సామ్రాజ్యాన్ని శాసిస్తున్నా స్మార్ట్‌ఫోన్‌లకు నో.. శాంసంగ్ వారసుడు లిమ్ డాంగ్-హ్యాన్ సక్సెస్ స్టోరీ..




న్యూఢిల్లీ : భారత్ అతి పెద్ద స్మార్ట్ ఫోన్ మార్కెట్.. ఈ రోజుల్లో పిల్లల నుండి పెద్దల వరకు స్మార్ట్ ఫోన్ లేనిదే బతకడం చాలా కష్టం. ప్రతి చిన్న అవసరానికి స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. దీంతో గుర్తు పెట్టుకోవడం అనేది మరచిపోయారు. ప్రతిదీ స్మార్ట్ ఫోన్ గుర్తు చేస్తోంది. అయితే మూడేళ్ల పాటు స్మార్ట్ ఫోన్ లేకుండా బతికితే ఎలా ఉంటుంది. ఎవరైనా ఊహించుకున్నారా.. ఆ ఆలోచన తలుచుకుంటే బాబోయ్ నా వల్ల కాదు అని అనిపిస్తుంది కదా..అయితే ఓ యువకుడు మూడేళ్ల పాటు స్మార్ట్ ఫోన్ లేకుండా గడిపాడంటే నమ్మగలరా.. అది కూడా ఓ దిగ్గజ స్మార్ట్ ఫోన్ కంపెనీ మాజీ చైర్మెన్ అధినేత అంటే ఇంకా షాకవుతారు.. అవును మీరు విన్నది నిజం.. ఇప్పుడు దక్షిణ కొరియాలో అత్యంత ప్రతిష్టాత్మకమైన విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందిన సియోల్ నేషనల్ యూనివర్శిటీ లో గత డిసెంబర్‌లో ప్రవేశం పొందిన ఒక యువకుడు ప్రపంచ వ్యాప్తంగా చర్చకు కేంద్రం బిందువుగా మారాడు.ఆ యువకుడి పేరే లిమ్ డాంగ్-హ్యూన్.హోటల్ షిల్లా అధ్యక్షురాలు లీ బూ-జిన్ కుమారుడు, అంతే కాకుండా దివంగత ఝఎంబఅస్త్ర మాజీ చైర్మన్ లీ కున్-హీ మనవడు. ప్రముఖ వ్యాపార కుటుంబానికి చెందిన వారసుడైనప్పటికీ.. ఆయన సాధించిన విద్యా విజయం వెనుక ఉన్న క్రమశిక్షణ, త్యాగం ఇప్పుడు అనేక మంది విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తోంది.ప్రైవేట్ విద్యా రంగానికి చెందిన వర్గాలు, ప్రముఖ మైల్ బిజినెస్ వార్తాపత్రిక నివేదికల ప్రకారం.. లిమ్ ఇటీవల సియోల్‌లోని డేచి-డాంగ్ ప్రాంతంలో ఉన్న ఒక ప్రైవేట్ క్రామ్ స్కూల్‌లో అతిథి వక్తగా పాల్గొన్నారు. అక్కడ విమూన్ హై స్కూల్ నుంచి మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన బ్రీఫింగ్ సెషన్‌లో ఆయన ప్రసంగించారు. దేశంలోనే అత్యుత్తమ విశ్వవిద్యాలయంలో నేను ఎలా అడ్మిషన్ పొందాననే అంశంపై తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.లిమ్ తన ప్రసంగంలో ప్రధానంగా కొరియన్ కాలేజ్ స్కాలస్టిక్ ఎబిలిటీ టెస్ట్ కి సిద్ధమయ్యే విధానంపై విలువైన సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా ఆయన చేసిన అత్యంత ఆసక్తికరమైన సిఫార్సు ఏమిటంటే.. మూడు సంవత్సరాల పాటు స్మార్ట్‌ఫోన్‌లను పూర్తిగా వాడకపోవడం. ఇది సులభమైన నిర్ణయం కాదని అంగీకరిస్తూనే.. దీని వల్ల తన దృష్టి, ఏకాగ్రత గణనీయంగా మెరుగుపడిందని లిమ్ స్పష్టం చేశారు.ఈ విషయాల వారీగా తన సిద్ధాంత విధానాన్ని వివరించిన లిమ్.. కొరియన్ భాషా విభాగంలో ఖచ్చితమైన పఠన గ్రహణశక్తి అత్యంత కీలకమని చెప్పారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను పదే పదే సాధన చేయడం అవసరమని సూచించారు. మాక్ పరీక్షలు రాయడం ఉపయోగకరమే అయినా.. తార్కికంగా బలహీనంగా రూపొందించిన ప్రశ్నల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.గణితంలో విశ్లేషణాత్మక తార్కికం అవసరమయ్యే ప్రశ్నలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని లిమ్ సూచించారు. ముఖ్యంగా విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించే జూన్, సెప్టెంబర్ మాక్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నలకు విద్యార్థులు తమ స్వంత పరిష్కార పద్ధతులను అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ఇందుకోసం ఎక్కువ సంఖ్యలో సమస్యలను పరిష్కరించడం ద్వారా మంచి ప్రవృత్తి ఏర్పడుతుందని వివరించారు. అలాగే స్వీయ నియంత్రణ ప్రాముఖ్యతను పదే పదే నొక్కి చెప్పారు. మూడేళ్లపాటు స్మార్ట్‌ఫోన్‌లు, వీడియో గేమ్‌లకు పూర్తిగా దూరంగా ఉండాలని బలంగా సూచించారు.ఇది చాలా కష్టమైన నిర్ణయమే, కానీ ఇది దృష్టిని అద్భుతంగా మెరుగుపరుస్తుంది. చదువులో పూర్తిగా లీనమయ్యేలా చేస్తుంది. మూడు సంవత్సరాల తర్వాత అది ముగిసినప్పుడు కలిగిన ఆనందాన్ని నేను నిజంగా ఆస్వాదించానని ఆయన అన్నారు. లిమ్ 2026 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్ ట్రాక్ కింద గత డిసెంబర్‌లో ాచీఖలోని ఎకనామిక్స్ విభాగంలో చేరారు. జూూలో అత్యంత అధిక స్కోర్లు సాధించే ముందు.. మిడిల్ స్కూల్ నుంచి హై స్కూల్ వరకు ఆయన ఎల్లప్పుడూ అగ్రశ్రేణి గ్రేడ్‌లను కొనసాగించారు.ఇదే విశ్వవిద్యాలయంలో ఆయన మామ, ప్రస్తుత శామ్‌సంగ్ చైర్మన్ లీ జే-యోంగ్ కూడా సుమారు 39 సంవత్సరాల క్రితం చదువుకున్నారు. ఆయన ఆసియా చరిత్రలో ప్రత్యేకత సాధించడం విశేషం. ఇలా ఒకే కుటుంబానికి చెందిన రెండు తరాల విద్యా ప్రయాణం ఇప్పుడు కొరియా విద్యా వర్గాల్లో ప్రత్యేక ఆసక్తిని రేపుతోంది.

# ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్: కేంద్రానికి సుప్రీంకోర్టు 'డెడ్ లైన్'!

న్యూఢిల్లీ : దేశంలో ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఆ వర్గాల్లోని ఆర్థికంగా స్థిరపిన వారిని(క్రీమీ లేయర్) రిజర్వేషన్ల నుంచి మినహాయించడంపై సుప్రీంకోర్టు మరోసారి క్రియాశీలక పాత్ర పోషిస్తోంది. ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్ల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలని.. క్రీమీ లేయర్‌ను మినహాయించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందించిన ధర్మాసనం.. దీనిపై తమ నివేదిక సమర్పించాలని కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసును విచారించింది. 2024లో ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లను ఉప-వర్గాలుగా విభజించేందుకు (కోటాలో కోటా) అనుమతినిస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చింది. ఆ తీర్పు వెలువడిన తర్వాత కేంద్ర సర్కారు క్రీమీ లేయర్ అమలుపై లేదా వర్గీకరణపై తీసుకున్న చర్యలు ఏమిటని సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది.ఓపీ శుక్లా, 'సమతా ఆందోళన్ సమితి' ఈ పిటిషన్లను దాఖలు చేశాయి. రిజర్వేషన్ల ఫలాలు కేవలం ఒకే వర్గానికి లేదా ఆ వర్గాల్లోని సంపన్నులకే పరిమితం కాకుండా.. అత్యంత వెనుకబడిన ఉప-కులాలకు చేరాలని వారు వాదించారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో వివిధ ఉప-కులాల ప్రాతినిధ్యంపై స్పష్టమైన డేటాను సేకరించాలని.. అలాగే క్రీమీ లేయర్‌ను గుర్తించేందుకు అవసరమైన ప్రమాణాలను నిర్ణయించాలని పిటిషనర్లు కోర్టును కోరారు.ఆగస్టు 2024 నాటి తీర్పులో సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలకు ఎస్సీ-ఎస్టీలను వర్గీకరించే అధికారం ఇచ్చింది. అయితే ఈ ప్రక్రియ ఏకపక్షంగా ఉండకూడదని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా శాస్త్రీయ ఆధారం, తగిన డేటా ఆధారంగానే వర్గీకరణ జరగాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఓబీసీ తరహాలోనే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో కూడా క్రీమీ లేయర్ అమలును పరిశీలించాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.ప్రస్తుతానికి కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై తన



వివరణ ఇవ్వాలని ఆదేశించిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను కొద్ది రోజులు వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సమాధానం, గణాంకాల ఆధారంగానే ఎస్సీ-ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీ లేయర్ అమలుపై ఒక తుది నిర్ణయం వచ్చే అవకాశం ఉంది. ఇది దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ఎమ్మెల్యే కొండయ్య విసిరిన సవాల్ కు చర్చలకు సిద్ధం: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ




రాయల్ జర్నలిజం (చీరాల), ఫిబ్రవరి 11:

చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై అసభ్యకరమైన పదజాలంతో మాట్లాడిన వ్యాఖ్యలకు ప్రతిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు తీవ్రంగా స్పందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చీరాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేశామని చెప్పుకుంటూ తిరుగుతున్న ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య నిజంగా ఏ అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

చీరాల నియోజకవర్గంలోని ఆటోనగర్ ప్రాంతంలో రోడ్ల నిర్మాణం చేపట్టి అభివృద్ధి చేసిన ఘనత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీదేనని, అప్పటి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయని తెలిపారు. అలాగే హ్యాండ్లూమ్ పార్క్ భూమి విషయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్వంత నిధులతో హైకోర్టులో స్టే తీసుకువచ్చి ఆ స్థలాన్ని రక్షించిన ఘనత కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులదేనని 29వ వార్డు కౌన్సిలర్ బత్తుల అనిల్ కుమార్ పేర్కొన్నారు.అలాగే చీరాల మున్సిపాలిటీలో కరెంట్ పోల్స్ నిర్మాణం కోసం సుమారు రూ.9 కోట్ల వ్యయంతో కరణం బలరామకృష్ణమూర్తి హయాంలో పనులు చేపట్టినట్లు తెలిపారు. చీరాలలో ఇలాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు కరణం బలరామకృష్ణమూర్తి, కరణం వెంకటేష్ బాబు హయాంలోనే జరిగాయని, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు చూస్తే ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యకు వాస్తవాలు అర్థమవుతాయని నియోజకవర్గంలో ఇసక అక్రమ రవాణా,రేషన్ బియ్యం అక్రమ రవాణాకి కొమ్ము కాస్తుంది తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు కాదా అని పట్టణ పార్టీ అధ్యక్షులు యాతం మేరీ బాబు ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా సంక్రాంతికి కోడిపందాలు, జూదం నిర్వహించిన ఘనత కూడా తెలుగుదేశం నాయకులది కాదా అని ప్రశ్నించారు,ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# రోటరీ క్లబ్ బాపట్ల ఆధ్వర్యంలో సైక్లింగ్ పోటీలు

## సైకిల్ తొక్కితే దీర్ఘకాలిక వ్యాధులు దరి చేరవు : రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు



రాయల్ జర్నలిజం (బాపట్ల) ఫిబ్రవరి 11: రోజువారీ వ్యాయామలలో సైక్లింగ్ దే అగ్రస్థానమని, గుండెను పదిలంగా ఉంచడంతోపాటు శారీరక సమతుల్యతను పెంచుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం పట్టణం లోని రోటరీ కళ్యాణ మండపం వద్ద రోటరీ యువజన వారోత్సవాలలో భాగంగా స్లో సైక్లింగ్ పోటీలో నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మన పూర్వీకులు ఏ ప్రాంతానికి వెళ్లాలన్న కానీ నడకనే వెళ్లేవారు. ఆ రోజుల్లో ద్విచక్ర వాహనాలు ఉండేవి కావు కాళ్లకు పని చెప్పాల్సిందే. అందుకే వారికి రక్త పోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక రోగాలు దరిచేరేవి కావు. ఆ తర్వాత సైకిల్లు వచ్చాయి. ఇది మంచి వ్యాయామం సాధనంగా మారింది. నేటి కాలంలో ఎక్కడకు వెళ్లాలన్న ద్విచక్ర వాహనాలపై ప్రయాణించడంతో వారు దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారు అన్నారు. బరువు తగ్గాలన్న, ఉబకాయానికి చెక్ పెట్టాలన్న, యవ్వనంగా ఉండాలి అన్న రోజు ఒక గంటపాటు సైక్లింగ్ చేస్తే మంచిదన్నారు. ఈ పోటీలలో సీనియర్ సైకిల్ పోటీల నందు లిటిల్ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన పీ. గీతిక ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి బాపట్ల పబ్లిక్ హై స్కూల్ కు చెందిన పి వాణి, తృతీయ బహుమతి లిటిల్ ఏంజెల్స్ పాఠశాల కు చెందిన జి లాస్య శ్రీ విజేతలుగా నిలిచారు. జూనియర్ సైకిల్ విభాగంలో అక్షర విద్యా భవన్ పాఠశాలకు చెందిన అద్వైత ప్రథమ బహుమతి, లిటిల్ ఏంజెల్స్ పాఠశాలకు చెందిన అక్షర, కార్తీక ద్వితీయ తృతీయ బహుమతులుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ బాపట్ల కార్యదర్శి కొత్త ఆంజనేయ వరప్రసాద్, కోశాధికారి కొత్త సుబ్బారావు, యువజన వారోత్సవాలు చైర్మన్ ఎస్ రమేష్ బాబు, హరిబాబు, బూర్లే రామసుబ్బారావు, కొల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 13న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయండి




రాయల్ జర్నలిజం (చీరాల), ఫిబ్రవరి 11:ఈనెల 13న బాపట్ల జిల్లా కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చీరాల డివిజన్ ఎస్టియు ప్రతినిధులు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీసులో 13వ తేదీన జరిగే ధర్నా కార్యక్రమంకు సంబంధించి సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు ప్రభుత్వం తమ మేనిఫెస్టో ఇచ్చిన హామీ మేరకు 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్లకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చీరాల ఎస్టియు ప్రతినిధులు ప్రభాకర్ రావు, ఏసురత్నం, టి. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, కె. సుబ్బారావు, పి. సుబ్బారావు, జీవీ. సుబ్బారెడ్డి, ఏ. వరవారెడ్డి పాల్గొన్నారు.

# సామాజిక సేవకు ఎన్ ఎస్ ఎస్ విద్యార్థులు సై



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11: సామాజిక సేవకు మేము సైతం అంటూ యువత పల్లె బాట పడుతుంది. డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) సభ్యులు ఏటా గ్రామీణ ప్రాంతాలలో సామాజిక సేవకు సై అంటున్నారు. చెరుకూరు గ్రామంలో ఒక వారం రోజులపాటు గ్రామంలోని సమస్యలపై యుద్ధభేరి మోగిస్తున్నారు. ఈ స్పెషల్ క్యాంపు ప్రత్యేక శిబిరాన్ని ఎన్టీఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అసోసియేట్ డాక్టర్ డి.డి స్మిత్ ప్రారంభించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా కొత్తపాలెం పంచాయతీ సర్పంచ్ పాలపర్తి సంపూర్ణమ్మ, చెరుకూరు పంచాయతీ సర్పంచ్ పాలేటి వీరయ్య పాల్గొని జ్యోతి ప్రజ్వలన వెలిగించారు. అనంతరం డి.డి స్మిత్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమాజంపై బాధ్యతను గుర్తు చేసేందుకు, సేవా కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వాములు చేయడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగుపరచడం, వ్యాధులు, ఆరోగ్య అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా గ్రామంలోని రైతులతో కలివిడిగా ఉంటూ వ్యవసాయ అనుబంధ సమస్యలు ఏమైనా ఉంటే వాటికి తగిన సూచనలు కళాశాల అధ్యాపకులను అడిగి రైతులకు తెలియజేయాలన్నారు. పాలపర్తి సంపూర్ణమ్మ, వీరయ్య మాట్లాడుతూ మా గ్రామాలను ఎంచుకోవడం చాలా సంతోషకరమని విద్యార్థులకు పూర్తిగా సహకారం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామస్తులు కల్లం సింగారెడ్డి, కుసుమం వెంకటరెడ్డి, కళాశాల సిబ్బంది డాక్టర్ జి.రవిబాబు, డాక్టర్ కల్లం వెంకట సుబ్బారామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ డి విజయ్ కుమార్, డాక్టర్ ఎన్ అశోక్ కుమార్, ఫైనల్ ఇయర్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# సమాజంలో మానవత విలువలు కరువు

- సహృదయంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ స్పందన :నాగేసు మట్టి ఖర్చులకు ఆర్థిక సహాయం
- నాగేసు మృతదేహాన్ని 13 కిలోమీటర్ల ద్విచక్ర వాహనంపై తీసుకుని వెళ్లటం అత్యంత అమానవీయమైన సంఘటన
- ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి



రాయల్ జర్నలిజం (కర్లపాలెం), ఫిబ్రవరి 11: సమాజంలో మానవతా విలువలు కోల్పోవడంతో పాటు డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ పేదవారు చనిపోతే ఒకలా, ఆర్థికవంతులు చనిపోతే మరోకల వ్యవహరిస్తున్న తీరు సమాజంలో తల దించుకునే పరిస్థితిని తీసుకువస్తుందని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి అన్నారు. కర్లపాలెం మండలం చింతయపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని రాళ్లచెరువుకు చెందిన నక్క నాగేసు గుండెపోటుతో మరణించి అంత్యక్రియలు చేయడానికి కూడా ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు మృతుని కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బండ్రెడ్డి గోపి మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మానవతా విలువలు పడిపోతున్నాయని ప్రతి ఒక్కరు డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ ఎవరెలా పోతే మనకేమి లే అనే విధంగా ఆలోచన చేయడం సరైన విధానం కాదన్నారు. మృతదేహాన్ని ఆటోలో ఇంటికి తరలించేందుకు డబ్బులు కూడా లేకపోవడంతో 13 కిలోమీటర్లు ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లే విషయం ప్రతి ఒక్కరిని బాధించిందన్నారు. మృతుడి అంత్యక్రియల నిమిత్తం ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి ఖర్చులకు కొంతమేర ఆర్థిక సహాయం అందించామని, రాజకీయాలకు అతీతంగా నాయకులు ఈ కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు, అధికార యంత్రాంగం కూడా అన్ని విధాల సహాయ సహకారాలు అందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని తీసుకెళ్తున్న విషయంలో బాపట్ల జిల్లా కలెక్టర్ స్పందించి మరొకసారి ఇలాంటి సంఘటనలు పునావృతం కాకుండా మహాప్రస్థానం వాహనాన్ని అప్పటికప్పుడే ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం మంచి విషయమని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ తరుపున జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, కార్యదర్శి బత్తుల సురేష్, కోశాధికారి జోగి సువర్ణరాజు, బొగ్గవరపు శివ, బీమా కోటేశ్వరరావు, మద్దిబోయిన గోపి, నైముల్లా, విన్నకోట శ్రీనివాసరావు, కోడిరెక్క రవి, సాల్మన్ రాజు, నరాల శెట్టి సుబ్బారావు ఉన్నారు.

# అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 11: ప్రైవేట్ అంబులెన్స్ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీల మేరకే ఫీజులు వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనివార్య పరిస్థితుల్లో రోగులు మృతి చెందిన సందర్భాల్లో మృతదేహాన్ని గౌరవప్రదంగా తరలించే బాధ్యత సంబంధిత ఆసుపత్రి సూపరింటెండెంట్, మెడికల్ ఆఫీసర్‌లదేనని స్పష్టం చేశారు. అంబులెన్స్ సేవల పేరుతో అదనపు రుసుములు వసూలు చేయడం లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను అంబులెన్స్ యజమానులు స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూమ్ నంబర్ 1967 / 7702806804 ను సంప్రదించాలని సూచించారు.

అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు..

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్, ఎస్పీ హెచ్చరించారు. కచ్చితత్వం లేకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం చట్టపరమైన నేరమని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి సంబంధించిన అంశాలపై ఎలాంటి సమాచారం ప్రచారం చేసే ముందు సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన వివరణ తీసుకోవడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజల్లో అపోహలు, గందరగోళం కలిగించే విధంగా పోస్టులు, సందేశాలు పంపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో బాపట్ల జిల్లా వైద్యాధికారి డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ డాక్టర్ పద్మావతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# నాగేసు తుమ్మాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుంది



**రాయల్ జర్నలిజం (కర్లపాలెం), ఫిబ్రవరి 11:** గుండెపోటుతో మృతి చెందిన కర్లపాలెం మండలం చింతాయపాలెం పంచాయతీ రాళ్లచెరువు సమీపంలో నివాసం ఉంటున్న నిరుపేద నక్కా నాగేశ్వరరావు కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరామర్శించారు. రాళ్లచెరువు సమీపంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న ఎస్టీ యానాది కుటుంబాల నివాస ప్రాంతాలను బుధవారం ఆయన పరిశీలించారు. నాగేశ్వరరావు మృతితో రోదిస్తున్న ఆ కుటుంబాన్ని ఓదార్చారు. ఆ కుటుంబంతో కొంత సమయం గడిపారు. వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నిత్యవసర సరుకులు, దుస్తులు, ఒక బస్తా బియ్యం, కూరగాయలు, కిచెన్ కిట్లు, దుప్పట్లు, రగ్గులు, టార్పాలిన్ పట్టలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిగిలిన నాలుగు కుటుంబాలకు కిచెన్ కిట్లు, దుప్పట్లు, రగ్గులు, టార్పాలిన్ పట్టలను కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. పంట కాల్వలో చేపలు వేట, పొలాలలో ఎలుకలు పట్టి జీవనం సాగించే నాగేశ్వరరావుకు రోజుకు రూ.300 ల నుంచి రూ.400లు సంపాదించే వాడని కుటుంబ సభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్వ గట్టు సమీపంలోనే గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా, కుమారుడు నాగేంద్రబాబు డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడని ఆయనకు చెప్పారు. గుండె పోటు రావడంతో మృతి చెందడం, వైద్యం కొరకు ఆసుపత్రికి, పేదరికంతో ద్విచక్ర వాహనంపై తరలింపుపై ఆయన ఆరా తీశారు. ఏ సమస్య వచ్చినా, ఇబ్బంది వచ్చినా,... నేను మీకు ఉన్నాను... నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చు, ఫిర్యాదు చేయవచ్చని ఆయన కోరారు. మృతి చెందిన నాగేశ్వరరావు మరణ ధ్రువీకరణ పత్రాన్ని సదరు కుటుంబ సభ్యులకు అందజేశారు. వితంతు పింఛన్ మంజూరు చేస్తామని తెలిపారు. ఆ కుటుంబాలకు నివాస స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆర్డిఓ పి గ్లోరియా, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, తహసిల్దార్ శ్రీదేవి, తదితరులు ఉన్నారు.




# Blink And Miss: AP Assembly On Absolute Fire!



Andhra Pradesh Assembly sessions officially started today and they began on a very entertaining note with the ruling and opposition having a go at each other. Incidentally, opposition leader YS Jagan attended the Assembly session after a year and this made a very interesting visual as it was very interesting to watch Jagan at the Assembly after a long break.But the sad thing here is that action progressed at an elevated pace in the Assembly as several blink and moments were registered. Incidentally, Jagan walked out of the Assembly house just minutes after entering the same as he protested the NDA government operations in the state.The YSR Congress ecosystem, including MLAs protested against the governor as well. They claimed that the government is not providing the opposition leader status to Jagan and they are failing at maintaining the law and order situation in the state.This quickly became a problematic situation in the Assembly house with the exit of the YSR Congress faction, as there is no designated opposition in the house now. This would essentially mean that the Andhra Pradesh budget sessions with progress without any opposition, which is going to be a very rare site. But at the end of the day, that is the state of affairs in Andhra Pradesh, and it has to be seen when this would get better.On the other hand, Chandrababu and deputy CM Pawan Kalyan have stated that the assembly session is of great importance and the same will be established in the cabinet that is scheduled for later in the day today.

# Canada Mass Shooting Kills 10 In School



Canada has witnessed one of its worst mass shooting incidents in history in the form of the school shooting that happened a short while back. This is a state of absolute panic and tragedy that's gripping the locals.A tragic mass shooting occurred on February 10, 2026, at Tumbler Ridge Secondary School in the small town of Tumbler Ridge, northeastern British Columbia, Canada.According to the latest updates from the Royal Canadian Mounted Police and reliable news sources, 10 people are confirmed dead, including nine victims and the suspected shooter, who died from an apparent self-inflicted gunshot wound.The victims include six people found deceased inside the school, one who died en route to the hospital, and two others discovered at a connected residence. More than 25 people were injured, with at least two suffering life-threatening wounds and others airlifted for treatment.The incident began around 1:20 p.m. local time when reports of an active shooter prompted a Police Initiated Public Alert (since canceled). Authorities state there is no ongoing threat to the public, and the shelter-in-place order for the town has been lifted.The shooter's identity, any potential connections to groups, and motivations remain under active investigation. Early reports suggest the violence appears to stem from anti-social or nihilistic impulses, but no confirmed links to organized extremism or specific ideologies have been released.

# Father Shoots Daughter Over Donald Trump!




In what could be considered an extremely detrimental and shocking incident, a father has shot and killed his own daughter over a debate that happened on United States president Donald Trump.A British woman, 23-year-old Lucy Harrison, was shot dead by her father, Kris Harrison, in his Texas home after a heated argument during a family visit. The clash reportedly began over politics, including former U.S. President Donald Trump, and grew intense before they were due to return to the UK. Tensions escalated further when Lucy challenged her father about how he would feel if she were harmed, leading to distress on both sides.Later that day, Kris took Lucy into his bedroom, saying he wanted to show her his Glock 9mm handgun. Seconds after entering the room, a shot rang out. Lucy was found on the floor with a fatal chest wound and was pronounced dead at the scene.Her father later claimed the weapon discharged accidentally as he demonstrated it. He admitted to consuming alcohol that day and has struggled with alcohol addiction in the past.A grand jury in Collin County declined to indict Kris on criminal charges, so no U.S. prosecution took place. Because Lucy was a British citizen who died abroad, a UK inquest has been opened to establish the full circumstances of her death. Her family remembers her as lively and passionate, mourning the loss.

# AP ministers Get Threats In Assembly!





In what could be considered an extremely detrimental and shocking, turn of events, it is being established that certain cabinet Ministers in Andhra Pradesh Assembly received threats today.Andhra Pradesh has been put on alert after four state ministers reportedly received threatening letters from unidentified individuals. The letters carried a warning asking the ministers to remain cautious, triggering concern within political and security circles.The ministers who received these letters are Kandula Durgesh, Anagani Satya Kumar, and Kollu Ravindra, along with another senior cabinet member. Though the exact contents of the letters have not been made public, sources suggest that the tone was serious enough for authorities to treat the matter as a potential security threat.Police and intelligence officials have begun an investigation to trace the origin of the letters and identify those responsible. Security around the ministers is likely to be reviewed and tightened as a precautionary measure. Officials are not ruling out any angle, including political motives or attempts to create unrest.Incidents involving threats to public representatives are taken very seriously, and the state administration is expected to act swiftly to ensure the safety of its leaders. Further details may emerge once the preliminary investigation is completed and forensic teams analyze the letters.The development has sparked discussion in political circles, with many emphasizing the need for stronger security measures and strict action against those attempting to intimidate elected representatives.

# Will AI Ruin The World? What Did Safety Expert Say?



Artificial intelligence has become a part and parcel of our day-to-day life, and it has even started to impact the employment opportunities globally with several thousands of jobs being lost to the same.In this context, something extremely shocking and detrimental has happened and let us have a look into this crucial matter.Mrinank Sharma, who headed the safeguards research team at AI company Anthropic, has resigned from his position and issued a strongly worded public letter cautioning about the state of the world.He described the current moment as a "world in peril," suggesting that the rapid rise of artificial intelligence is colliding with several other global crises at the same time.Although Sharma did not point to any specific event behind his decision, his message reflects growing unease within sections of the tech community about the long term consequences of unchecked AI progress.He emphasized that AI is advancing in a fragile global environment shaped by political tensions, economic instability, and social change, making responsible development more critical than ever.One of the final projects Sharma worked on explored the psychological and cultural impact of AI assistants on human behavior. The research sought to understand whether increasing dependence on AI tools could slowly make people "less human" or distort fundamental aspects of humanity.It examined concerns such as reduced independent thinking, emotional detachment, and the risk of people relying too heavily on machines for judgment.His resignation has triggered fresh debate around AI ethics, safety measures, and the responsibility of technology companies as artificial intelligence becomes deeply woven into everyday life.







# మేం పాకిస్థాన్.. మా రూటే సపరేటు: సల్మాన్ అఘా



తమ జట్టు ప్రపంచానికి భిన్నంగా ఆలోచిస్తుందని పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా అన్నాడు. అమెరికాతో మ్యాచ్‌లో టాస్ గెలిస్తే తాము ముందుగా బ్యాటింగ్ చేసేవాళ్లమని చెబుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. అన్నీ జట్లు ఒకలా ఆలోచిస్తే తమ జట్టు ఆలోచన వాటికి భిన్నంగా ఉంటుందని చెప్పాడు. సమష్టి ప్రదర్శనతోనే అమెరికాపై విజయం సాధించామని తెలిపాడుఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా అమెరికాతో కొలంబో వేదికగా మంగళవారం జరిగిన తమ రెండో మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన పాకిస్థాన్ 32 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 190 పరుగులు చేయగా.. అమెరికా 158 పరుగులే చేసి ఓటమిపాలైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాహిబ్జాదా ఫర్హాన్(41 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 73)తో పాటు ఉస్మాన్ తారిఖ్(3/27), షాదాబ్ ఖాన్(2/26) అమెరికా పతనాన్ని శాసించారు. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన సల్మాన్ అలీ అఘా పరిపూర్ణమైన ప్రదర్శనతో విజయం సాధించామని సంతోషం వ్యక్తం చేశాడు.'నేను ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాను. నేను నవ్వకుండా ఉండటం మీరు ఎప్పుడైనా చూశారా? (నవ్వుతూ). ఇదొక పరిపూర్ణమైన విజయం. గత మ్యాచ్‌లో మేం మిడిల్ ఓవర్లలో బాగా బ్యాటింగ్ చేయలేదు. కానీ ఈ మ్యాచ్‌లో అద్భుతంగా ఆడాం. 190 పరుగులు చేసిన తర్వాత ఆ లక్ష్యాన్ని కాపాడుకోగలమని మాకు తెలుసు. టాస్ గెలిచి ఉంటే నేను బ్యాటింగే ఎంచుకునేవాడిని. మాకున్న బౌలింగ్ దళంతో 160-170 పరుగులు చేసినా సునాయసంగా గెలుస్తాం. ఆ నమ్మకం నాకుంది. బ్యాటింగ్ ఎందుకు ఎంచుకోవాలనుకున్నానంటే.. మేం పాకిస్థాన్.. ప్రపంచం చేసే దానికి భిన్నంగా ఆలోచిస్తాం.లక్ష్య ఛేదనలో మేం చాలా సౌకర్యవంతంగా ఉంటాం. మా బ్యాటింగ్ ఆర్డర్ చాలా ఫ్లెక్సిబుల్‌గా ఉంటుంది. టాప్-3 ఆటగాళ్లు ఎప్పుడూ ఒకే ఆర్డర్‌లో ఆడుతారు. కానీ తర్వాతి బ్యాటర్లు పరిస్థితులకు తగ్గట్లు మారుతుంటారు. వికెట్లు పడకపోతే వచ్చి దూకుడుగా ఆడే ఫినిషర్లు, వికెట్లు పడితే ఆచితూచి ఆడుతూ మ్యాచ్‌ను ఆఖరి వరకు తీసుకెళ్లే బ్యాటర్లు కూడా ఉన్నారు. పవర్ ప్లేలో మేం ఇంకాస్త మెరుగ్గా బౌలింగ్ చేయాలి. ఈ రోజు ప్రదర్శన బాగానే ఉంది. కానీ ఇంకా మెరుగ్గా రాణించగలం.'అని సల్మాన్ అఘా చెప్పుకొచ్చాడు.

# ఆ తప్పిదమే మా ఓటమిని శాసించింది: అమెరికా కెప్టెన్



మిడిల్ ఓవర్లలో బౌలింగ్, బ్యాటింగ్ వైఫల్యం తమ ఓటమిని శాసించిందని అమెరికా కెప్టెన్ మొనాంక్ పటేల్ అన్నాడు. అనవసర ఒత్తిడికి లోనై మూల్యం చెల్లించుకున్నామని తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన తమ రెండో మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన అమెరికా 32 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 190 పరుగులు చేయగా.. అమెరికా 158 పరుగులే చేసి ఓటమిపాలైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షాహిబ్జాదా ఫర్హాన్(41 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 73), ఉస్మాన్ తారిఖ్(3/27), షాదాబ్ ఖాన్(2/26) అమెరికా పతనాన్ని శాసించారు. ఈ మ్యాచ్ అనంతరం తమ పరాజయంపై మాట్లాడిన మొనాంక్ పటేల్.. మిడిల్ ఓవర్లలో కాస్త మెరుగైన ప్రదర్శన చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేదని అభిప్రాయపడ్డాడు.'మేం పవర్‌ప్లేలో బాగానే బౌలింగ్ చేశాం. కానీ మిడిల్ ఓవర్లలో పరుగులను కట్టడి చేయలేకపోయాం. చివరి నాలుగు ఓవర్లలో పేసర్లు బాగా బౌలింగ్ చేయడంతో తిరిగి మ్యాచ్‌లోకి వచ్చాం. పాకిస్థాన్ 190 పరుగులు చేసినా మేము రేసులోనే ఉన్నాం. పవర్‌ప్లేలో బాగానే బ్యాటింగ్ చేశాం. కానీ మిడిల్ ఓవర్లలో దూకుడుగా ఆడలేకపోయాం.బ్యాటింగ్ చేసేటప్పుడు మాలో ఆ పట్టుదల కనిపించలేదు. పాక్ స్పిన్నర్లు వేగం తగ్గించి బౌలింగ్ చేయడంతో బౌండరీలు కొట్టడం కష్టమైంది. దాంతో మేం అనవసర ఒత్తిడికి లోనయ్యాం. అదే మా ఓటమిని శాసించింది. గత 12-15 నెలలుగా మేం మంచి క్రికెట్ ఆడుతున్నాం. ఈ మ్యాచ్‌కు కూడా పూర్తి ఆత్మవిశ్వాసంతో వచ్చాం. మ్యాచ్‌లో కొన్ని పొరపాట్లు జరిగాయి.ఈ వరల్డ్ కప్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచి టోర్నీని బలంగా ముగించాలనుకుంటున్నాం. వేర్వేరు వేదికలపై ఆడటం అంత సులువు కాదు. ఇప్పుడు మేం చెన్నై వెళ్తాం. అక్కడ మాకు ఒక ప్రాక్టీస్ సెషన్ ఉంటుంది. మరింత బలంగా తిరిగి రావడానికి కృషి చేస్తాం.'అని మోనాంక్ పటేల్ చెప్పుకొచ్చాడు. అమెరికా తమ తదుపరి మ్యాచ్‌లను నెదర్లాండ్స్, నమీబియాతో ఆడనుంది. ఈ ఓటమితో సూపర్-8 అవకాశాలను అమెరికా చేజార్చుకుంది.

# నిఖిల్ స్వయంభూ టీజర్.. ఏ రేంజ్‌లో ఉందంటే..




టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా స్వయంభూపై ఆడియన్స్ లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఆ సినిమాలో సంయుక్త మీనన్, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఆ మూవీ.. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 10న విడుదల కానుంది.అయితే రిలీజ్ కు ముందు వరుస అప్డేట్స్ తో మంచి బజ్ క్రియేట్ చేస్తున్న స్వయంభూ మేకర్స్.. తాజాగా టీజర్ ను విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారిన టీజర్.. అందరినీ ఆకట్టుకుంటోంది. అదిరిపోయే విజువల్స్.. గ్రాండ్ మేకింగ్ తో సినీ ప్రియులను మెప్పిస్తోంది. ఇప్పటికే నిఖిల్ చెప్పినట్లు.. న్యాయపరమైన పాలనకు సింబల్ గా నిలిచే రాజదండం సెంగోల్ చుట్టూ మూవీ సాగుతుందని టీజర్ ద్వారా క్లారిటీ వచ్చింది.రాజుల కాలంలో ఫ్యూచర్ ను డిసైడ్ చేసే రాజ దండాన్ని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు జరిగే యుద్ధాలే సినిమా మెయిన్ స్టోరీ లైన్ గా టీజర్ ద్వారా అర్థమవుతోంది. ఆ యుద్ధాల్లో ధర్మం కోసం పోరాడే ఓ యోధుడిగా నిఖిల్ ఎంట్రీ ఇవ్వడం ఆసక్తి రేపుతోంది. 985 ఏడీ కాలానికి ప్రేక్షకులను తీసుకెళ్లేలా క్రియేట్ చేసిన భవనాలు, సెట్స్, కాస్ట్యూమ్స్, విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. హాలీవుడ్ రేంజ్ లో ఉన్నాయనే చెప్పాలి.అదే సమయంలో సినిమాలో నిఖిల్ నెవ్వర్ బిఫోర్ అనేలా కనిపించనున్నారు. యోధుడి పాత్ర కోసం బాడీ లాంగ్వేజ్ లో భారీ ట్రాన్స్ఫర్మేషన్ చూపించారు. ఆయన లుక్ అదిరిపోయేలా ఉండగా.. టీజర్ లో ప్రతి విజువల్ లో కూడా ఓ రేంజ్ లో మెప్పించారు. పాత్రలో పూర్తిగా లీనమైనట్లు కనిపించడం.. స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఆయన పెర్ఫార్మెన్స్ సినిమాకు బిగ్ అసెట్ గా మారేలా కనిపిస్తుంది.హీరోయిన్స్ సంయుక్త మీనన్, నభా నటేష్ రోల్స్ ను టీజర్ లో పెద్దగా రివీల్ చేయకపోయినా కీలక పాత్రలు పోషిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి టీజర్.. సినిమాపై ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ముఖ్యంగా టెక్నికల్ పరంగా స్వయంభూ ఒక పవర్ హౌస్ లా కనిపిస్తోంది. ప్రొడక్షన్ వాల్యూస్, ఇంటర్నేషనల్ రేంజ్ యాక్షన్ కొరియోగ్రఫీ, 3డీ విజువల్స్ సినిమాకు హైలైట్ గా నిలవనున్నాయి.మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ టీజర్ ను మరింత గ్రాండ్ గా మార్చింది. అయితే హైదరాబాద్ లోని పీసీఎక్స్ థియేటర్‌లో మీడియా కోసం ప్రదర్శించిన 3డీ టీజర్ అందరినీ ఫిదా చేసిందని సమాచారం. ప్రతి ఫ్రేమ్ థియేటర్ ఎక్స్పీరియన్స్ ను కొత్త స్థాయికి తీసుకెళ్తుందనే టాక్ వినిపిస్తోంది. మరి ప్రపంచవ్యాప్తంగా 10 భాషల్లో విడుదల కానున్న స్వయంభూ మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

# రెడ్ డ్రెస్ లో మానస అందాలు.. ఆ పిక్స్ అదుర్స్!



సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్ ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్ కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్ ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్ లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్ ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా ఘాటు మిర్చీలా రెడ్ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి.అందం , అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్టైల్ తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ . ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్ తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్ లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది.ఇకపోతే ఈ లుక్ లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది.ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి.మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరఫున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.

# పంథా మార్చిన నందమూరి బాలకృష్ణ!



టాలీవుడ్ లో నాలుగు దశాబ్దాలుగా తనదైన మాస్ ఇమేజ్ తో ప్రేక్షకులను అలరిస్తున్న నందమూరి బాలకృష్ణ ఇప్పుడు కెరీర్ లో కొత్త స్ట్రాటజీతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తున్నారు. ఒకప్పుడు మాస్, రొటీన్ కమర్షియల్ కథలకు పరిమితమైన బాలయ్య.. ఇప్పుడు కంటెంట్ కు ప్రాధాన్యం ఉన్న, స్టైలిష్ ఎలిమెంట్స్ తో కూడిన విభిన్న కథలను ఎంచుకుంటూ ట్రెండ్ మార్చుతున్నారు. దీంతో యంగ్ డైరెక్టర్లకు ఆయన హాట్ ఫేవరెట్ గా మారడం విశేషం.అయితే గత ఏడాది మొదట్లో డాకు మహారాజ్ తో వచ్చి విజయాన్ని అందుకున్న బాలయ్య.. ఆ తర్వాత అఖండ 2తో మాస్ ప్రేక్షకులను థియేటర్లకు రప్పించారు. ఓవరాల్ గా సినిమా హిట్ కాకపోయినా.. వయసుతో సంబంధం లేకుండా వరుస యాక్షన్ సినిమాలు చేస్తూ యంగ్ హీరోలకు పోటీ ఇవ్వడం గమనార్హం. బాలయ్య సినిమా విడుదలైతే థియేటర్లలో కనిపించే హంగామా ఇప్పటికీ అదే రేంజ్ లో ఉండటం ఆయన స్టార్ డమ్ కు పర్ఫెక్ట్ ఎవిడెన్స్.అదే సమయంలో ఇప్పుడు బాలయ్య అప్ కమింగ్ ప్రాజెక్టులపై ఆసక్తికర చర్చ సాగుతోంది. ముఖ్యంగా ముగ్గురు దర్శకుల పేర్లు వినిపిస్తున్నాయి. అందులో ముందుగా గోపీచంద్ మలినేని. ఆయన దర్శకత్వంలో చీదీఖ 111 ప్రాజెక్ట్ అనౌన్స్మెంట్ ఇప్పటికే వచ్చింది. వీరసింహారెడ్డి వంటి బ్లాక్ బస్టర్ తర్వాత ఆ కాంబో రిపీట్ అవుతుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్ పై సతీష్ కిలారు నిర్మిస్తున్న ఆ మూవీ షూటింగ్ మార్చి 19 నుంచి ప్రారంభం కానుంది!యాక్షన్ డ్రామాకు ఫ్యామిలీ సెంటిమెంట్ యాడ్ చేసి పక్కా కమర్షియల్ ఎంటర్టైనర్ గా తెరకెక్కిస్తున్నారట. ఉగాది తర్వాత షూటింగ్ స్పీడ్ పెంచి, దసరా కానుకగా విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు ఎనర్జిటిక్ డైరెక్టర్ హరీష్ శంకర్ కూడా బాలయ్య కోసం పవర్ ఫుల్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని టాక్. బాలయ్య బాడీ లాంగ్వేజ్ కు తగ్గ మాస్ ఎలిమెంట్స్ తో కథ వినిపించి గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురుచూస్తున్నారని తెలుస్తోంది.డాకు మహారాజ్ ను నిర్మించిన సితార ఎంటర్టైన్మెంట్స్ అధినేత సూర్యదేవర నాగవంశీనే ఆ మూవీని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారట. అయితే అందరిలో ఎక్కువ ఆసక్తి రేపుతున్న కాంబినేషన్ మాత్రం వివేక్ ఆత్రేయతో బాలయ్య మూవీ. బ్రోచేవారెవరురా, అంటే సుందరానికి వంటి విభిన్న చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న వివేక్, బాలయ్యను కొత్త యాంగిల్ లో చూపించే కథ సిద్ధం చేశారట.మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో ఆ సినిమా తెరకెక్కే అవకాశం ఉందని, 2027 మధ్యలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నట్లు వినికిడి. ఏదేమైనా వివేక్ ఆత్రేయతో మూవీ అంటే.. బాలయ్య ప్రయోగం చేస్తున్నారనే చెప్పాలి. మొత్తానికి తన పంథాను మార్చుకున్న నటసింహం లైనప్ మాస్, స్టైలిష్, కంటెంట్ ఓరియెంటెడ్, ప్రయోగాత్మక చిత్రాలతో మిక్స్ డ్ బ్యాగ్ గా కనిపిస్తోంది. మరి కొత్త చిత్రాలతో బాలయ్య ఎలాంటి హిట్స్ అందుకుంటారో చూడాలి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA -522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH,
EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , EMIL SRIKANTH9550389070@GMAIL.COM